

నవరస నట సార్వభౌముడు...

- జీవన పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 143 | విజయవాడ, శనివారం 24 డిసెంబర్ 2022 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 24 December 2022 | Rs



సత్యనారాయణ కన్నుమూత

• పలువురు ప్రముఖుల నివాళి • ప్రభుత్వ లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

'యముండ..' అంటూ వెండి తెర యమధర్మరాజుగా తెలుగు ప్రేక్షకుల హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్న నట సార్వభౌముడు ఇకలేరు. ఆరు దశాబ్దాలుగా తెలుగు ప్రజలను అలరించిన నవరస ప్రవాహం ఆగిపోయింది. నవరస నట సార్వభౌముడు కైకాల సత్యనారాయణ (87) శుక్రవారం తెల్లవారు జామున కన్నుమూశారు. గత కొంతకాలంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన బంజారాహిల్స్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య నాగేశ్వరమ్మ, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.పౌరాణికం, జానపదం, సాంఘీకం కథ ఏదైనా.. తన నటనతో ప్రేక్షకులను కట్టిపడేసిన సత్యనారాయణ మరణించాన్న వార్తతో తెలుగు సినీ లోకం తల్లడిల్లింది. తెలుగు రాష్ట్రాల్లో విషాద వాతావరణం నెలకొంది. తెలంగాణ ప్రభుత్వ అధికార లాంఛనాలతో జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో సత్యనారాయణ అంత్యక్రియలు శుక్రవారం జరగనున్నాయి. బంజారాహిల్స్‌లోని నివాసంలో ఆయన భౌతికకాయానికి ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర మాజీ మంత్రి, సినీనటులు చిరంజీవి, పవన్ కల్యాణ్, మోహన్‌బాబు, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. కైకాల కుటుంబ సభ్యులను సిఎం ఓదార్చారు. అనంతరం అక్కడ మీడియాతో సిఎం కెసిఆర్ మాట్లాడారు. విభిన్నమైన పాత్రలను పోషిస్తూ తన విభిన్నమైన నటనతో మూడు తరాల తెలుగు ప్రేక్షకుల ఆదరాభిమానాలను కైకాల చూరగొన్నారని తెలిపారు. నవరస నటసార్వభౌమునిగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని అనేక అవార్డులు అందుకొన్నారని గుర్తు చేశారు. లోక్‌సభ సభ్యుడిగా కైకాల చేసిన ప్రజా సేవ, కళాసేవ గొప్పదన్నారు. కైకాలతో కలిసి పనిచేసిన సందర్భాలను కెసిఆర్ స్మరించుకున్నారు. భారత సినీరంగానికే కైకాల సత్యనారాయణ గర్వకారణమైన అత్యంత ప్రతిభావంతమైన నటుడంటూ ప్రముఖ చిరంజీవి నివాళులర్పించారు. ఎటువంటి అరమరికలూ లేకుండా ఉన్నది ఉన్నట్లు మాట్లాడేవారని తెలిపారు. నటన, రుచికరమైన భోజనం కైకాలకు ప్రాణమన్నారు. తన భార్య చేతివంట అమితంగా ఇష్టపడేవారని ఆయనతో జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ట్విట్టర్‌లో చిరంజీవి స్పందించారు.

కృష్ణా జిల్లా కౌతవరం గ్రామంలో 1935 జులై 25న కైకాల సత్యనారాయణ జన్మించారు. గుడివాడ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. నటనపై ఉన్న ఆసక్తితో కాలేజీ రోజుల్లోనే ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. సత్యనారాయణలోని టాలెంట్‌ను ప్రముఖ నిర్మాత డిఎల్ నారాయణ గుర్తించి 'సిపాయి కూతురు'లో అవకాశం ఇచ్చారు. పౌరాణికం, జానపదం, కమర్షియల్... ఇలా ఎన్నో చిత్రాల్లో ఆయన కనిపించారు. హీరో పాత్రలు కూడా వేశారు. ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ తదితరుల చిత్రాల్లోనూ కీలక పాత్రల్లో నటించారు. యమధర్మరాజు, దుర్యోధనుడు, ఘటోత్కచుడు, దుశ్శాసనుడు, కర్ణుడు, భరతుడు, రావణాసురుడి పాత్రల్లో మెప్పించారు. 'మహర్షి' తర్వాత ఆయన మళ్లీ స్క్రీన్‌పై కనిపించలేదు. 1996లో మచిలీపట్నం పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి తరఫున ఎన్నికయ్యారు.



సిక్కింలో ఘోరం

ట్రక్కు లోయలో పడి 16మంది జవాన్లు మృతి

రాష్ట్రపతి, ప్రధాని తదితరుల దిగ్భ్రాంతి

గ్యాంగ్‌టక్ : ఈశాన్య రాష్ట్రం సిక్కింలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సైనికులను తీసుకువెడుతున్న ట్రక్కు అదుపుతప్పి లోయలో పడటంతో 16 మంది మరణించారు. మరో నలుగురు తీవ్ర గాయాలపాలైనారు. ప్రమాద తీవ్రతకు సైనికులు ప్రయాణం చేస్తున్న ట్రక్కు తునాతునకలైంది. శుక్రవారం ఉదయం భారత్-చైనా సరిహద్దు సమీపంలోని ఉత్తర సిక్కిం జెమా వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. సైనిక అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం చాటెన్ నుండి థాంగూ ప్రాంతంలోని సరిహద్దు పోస్టుల వద్దకు మూడు వాహనాలతో సైనిక కాన్వాయ్ బయలుదేరింది. మార్గమధ్యలో వీటిలో ఒక వాహనం ప్రమాదానికి గురైంది. ఆ సమయంలో వాహనంలో 20 మంది సైనికులు ఉన్నారు. వీరిలో 16 మంది అక్కడికక్కడే మరణించారు. మృతుల్లో ముగ్గురు జూనియర్ కమిషన్ అధికారులు, 13 మంది జవాన్లు ఉన్నారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, రెస్క్యూ బృందం హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయచర్యలు చేపట్టాయి.

దట్టమైన మంచు... ప్రమాదకర మలుపు

దట్టమైన మంచుతో పాటు, అత్యంత ప్రమాదకరమైన మలుపు ఈ దుర్ఘటనకు కారణంగా భావిస్తున్నారు. వాహనం అకస్మాత్తుగా అదుపుతప్పి వందల అడుగు లోతు ఉన్న లోయలోకి దూసుకుపోయిందని సైనిక అధికారులు తెలిపారు. అంత ఎత్తునుండి మిగతా 2లో

ముగిసిన పార్లమెంటు

శీతాకాల సమావేశాలు సమాప్తం

విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా వామపక్షాల ఎంపీల ధర్నా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు సమావేశాలు వారం రోజుల ముందు ముగిశాయి. ఈ నెల 7 నుంచి 29 వరకు శీతాకాల సమావేశాలు నిర్వహించాలని తొలుత నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, శుక్రవారమే ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో లోక్‌సభలో ఏడు, రాజ్యసభలో తొమ్మిది బిల్లులను ఆమోదించారు. సమావేశాల చివరిరోజున కూడా వామపక్ష ఎంపిలు విద్యుత్ రంగ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా గళం విప్పారు. పార్లమెంటు ఆవరణలోని గాంధీ బొమ్మ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సమావేశాలు ముగిసిన తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, వి. మురళీధరన్‌లతో కలిసి మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి)ల సిఫార్సుల మేరకు సమావేశాలను కుదించినట్లు తెలిపారు. మల్టీ స్టేట్ కో ఆపరేటివ్ సొసైటీస్ (సవరణ) బిల్లు, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లులను పార్లమెంట్ జాయింట్ కమిటీకి పంపామని పేర్కొన్నారు.

ఉభయ సభల్లో ఆమోదించిన బిల్లులు
వన్యప్రాణుల (రక్షణ) బిల్లు
ఎనర్జీ కన్జర్వేషన్ (సవరణ) బిల్లు
న్యూఢిల్లీ ఆర్బిట్రేషన్ సెంటర్ (సవరణ) బిల్లు
రాజ్యాంగ (ఎస్‌సి, ఎస్‌టి) ఉత్తర్వు (రెండో సవరణ) బిల్లు
మారిటైమ్ యాంటీ పైరసీ బిల్లు
రాజ్యాంగ (ఎస్‌టి) ఉత్తర్వు (రెండో సవరణ) బిల్లు
రాజ్యాంగ (ఎస్‌టి) ఉత్తర్వు (నాలుగో సవరణ) బిల్లు
ద్రవ్య వినిమయ (నెంబర్ 4) బిల్లు
ద్రవ్య వినిమయ (నెంబర్ 5) బిల్లు



విద్యుత్ ప్రయివేటీకరణ ఆపండి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్ ప్రయివేటీకరణ ఆపాలని వామపక్ష ఎంపిలు డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. 'విద్యుత్ ప్రయివేటీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలి. విద్యుత్ సబ్సిడీలను కొనసాగించాలి. విద్యుత్ ప్రజల హక్కు.' అని రాసిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేత ఎలమరం కరీం మాట్లాడుతూ రాష్ట్రాలను సంప్రదించకుండా విద్యుత్ సవరణ బిల్లును సభలో తీసుకురావడం దారుణమని అన్నారు. ఈ అంశం రాష్ట్రాల పరిధిలోకి వస్తుందని, రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగం ప్రయివేటీకరణతో రైతులు, పేదలకు ఇచ్చే సబ్సిడీలను కోత విధిస్తారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎంపిలు పిఆర్ నటరాజన్, బికాష్ రంజన్ భట్టాచార్య, వి.శివదాసన్, జాన్ బ్రిట్టాస్, ఎఎ రహీమ్, ఎఎం ఆరీఫ్, సిపిఐ ఎంపిలు కె.సుబ్బరాయన్, పి.సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కులో చుక్కల మందు

• భారత్ బయోటెక్ వ్యాక్సిన్‌కు కేంద్రం ఆమోదం

ఐసిఐసిఐ మాజీ సిఇఒ చందా కొచ్చర్ దంపతుల అరెస్టు

జనవరిలో కడప 'ఉక్కు' నిర్మాణం



• కొప్పర్తి నుంచి కృష్ణపోర్టు వరకు రైల్వే లైను : సిఎం వైఎస్ జగన్

• రూ.905 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- కడప ప్రతినిధి, కడప అర్బన్

కడప జిల్లా జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు జనవరి చివరి వారంలో ప్రారంభం కానున్నాయని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జిందాల్ స్టీల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.8,800 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు శుక్రవారం ఆయన కమలాపురంలో జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. కొప్పర్తి పారిశ్రామికవాడలోని ఆరు వేల ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఇఎంసి, మెగా ఇండ్రస్టియల్ హబ్‌లు పూర్తి స్థాయిలో సాకారమైతే మూడు లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయన్నారు. రూ.150 కోట్లతో కొప్పర్తి పారిశ్రామికవాడకు బ్రహ్మసాగర్ నుంచి నీటి సరఫరా చేయడానికి 32.4 కిలోమీటర్ల పైప్‌లైను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజలనే నమ్ముకున్నాను

చంద్రబాబు మాదిరిగా తనకు ఎల్లోమీడియా, దత్తపుత్రుడు లేరని జగన్మోహన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాదిరిగా ఈ రాష్ట్రం కాకపోతే మరో రాష్ట్రం తనకు ఉండదని అన్నారు. తనది ఒకే రాష్ట్రం, ఐదు కోట్ల జనాభా కలిగిన ఒకే కుటుంబం, ఒకే నివాసం, ఒకే మమకారం, ఇంటింటా సంతోషం తన నినాదమని ప్రకటించారు. అంతకుముందు ఆయన కమలాపురం నియోజకవర్గంలోని రూ.905 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వాటిలో కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి కృష్ణపట్నం పోర్టు వరకు రైల్వే, కార్గో టెర్మినల్ పనులు కూడా ఉన్నాయి. జిల్లా ఇన్‌ఛార్జి మిగతా 2లో

ఎన్నికల వేళ ఉచిత బియ్యం

• కేంద్రం నిర్ణయం



న్యూఢిల్లీ : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పథకాన్ని ప్రకటించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఇప్పటివరకు కిలో మూడు రూపాయలకు ఇస్తున్న బియ్యాన్ని ఇకనుండి ఏడాది పాటు ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించింది. జనవరి ఒకటవ తేది నుండి ఈ పథకం అమలులోకి వస్తుంది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశానంతరం కేంద్ర ఆహారశాఖ మంత్రి పీయూష్‌గోయల్ మీడియాతో మాట్లాడుతూ ప్రియార్టీ హౌస్ హోల్డ్స్ (పిహెచ్‌హెచ్) పరిధిలోకి వచ్చే వారికి ఒక్కొక్కరికి ఐదు కిలోలు, అంత్యోదయ అన్నయోజన పథకం లబ్ధిదారులకు కుటుంబానికి 35 కిలోల వంతున ఉచితంగా బియ్యం పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయంతో దేశ వ్యాప్తంగా 81.35 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతాయని, కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తెలిపారు. పిహెచ్‌హెచ్ కార్డు పరిధిలోకి ట్రాన్స్‌జెండర్లు, 40శాతంపైన అంగవైకల్యం ఉన్నవారు, ట్రైబల్‌గ్రూపులు, నిలువ నీడలేని వారు, విడో పెన్షనర్లు, యాచనతో జీవనం సాగించేవారు వస్తారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన పథకాన్ని రద్దు చేశారు.

హైడ్రో పేరుతో అడవులు అదానీపరం

• పవర్ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాల్సిందే

• గిరిజనులకు నష్టం చేకూరిస్తే ఊరుకోం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో అడవులను అదానీకి కట్టబెట్టే కుట్రలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాల్పడుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏజెన్సీలో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు మంజూరు చేసిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు నష్టం చేకూర్చే చర్యలను పోరాటాలతో తిప్పికొడతామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో సిపిఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ చట్టాలను ధిక్కరించి, రాజ్యాంగంలోని 5వ, 6వ షెడ్యూల్ నిబంధనలను ఉల్లంఘించి హైడ్రో పవర్ ప్రాజెక్టుల కోసం అటవీ భూమిని అదానీకి అప్పగిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన అనుమతులను రద్దు చేయకపోతే గిరిజనుల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ పేరుతో అదానీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేట్ కంపెనీలకు జగన్ ప్రభుత్వం 75 వేల ఎకరాల భూమిని కేటాయించిందని, అందులో గిరిజన ప్రాంతంలోని 15 వేల ఎకరాల అటవీ భూమి ఉందని తెలిపారు. గత పదేళ్ల కాలంలో అదానీకి చెందిన కార్పొరేట్ కంపెనీలకు వేల ఎకరాల భూమిని ధారాదత్తం చేశారని, నేటికీ పరిశ్రమలు ఏర్పాటు చేయలేదని, ఉపాధి కల్పించలేదని గుర్తు చేశారు. అభివృద్ధి పేరుతో ఆదివాసీల బతుకుల విధ్వంసానికి పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. పోలవరం వరద బాధితులకు పునరావాసం కల్పించలేని వారు హైడ్రో పవర్ ప్రాజెక్టు ద్వారా నిర్వాసితులవుతున్న ఆదివాసీలను ఆదుకుంటారని భ్రమ పడాల్సిన అవసరం లేదని గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు ఒకటే పరిష్కారం కాదని, తగిన నిధులు కేటాయించాల్సి ఉందని అన్నారు. గిరిజన ప్రాంతం సమగ్రాభివృద్ధికి అవసరమైన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం వల్ల గిరిజన ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి, కేపిటల్ అకౌంట్, రెవెన్యూ అకౌంట్ పేరుతో ఎస్‌సి, ఎస్‌టిలకు కేటాయించాల్సిన మిగతా 2లో

పోలీస్ రిక్రూట్‌మెంట్ వయోపరిమితి పెంపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో వయోపరిమితిని మరో రెండు సంత్సరాలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అధికారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. నోటిఫికేషన్లో 27 ఏళ్లకు రిక్రూట్‌మెంటును పరిమితం చేయడం, దానిని పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో మరో రెండు సంవత్సరాలు పెంచాలని ఈ సమావే శంలో నిర్ణయించారు. ఈ మేరకు 27ఏళ్ల వయోపరి మితిని 29ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో మూడేళ్లు పెంచాలి : డివైఎఫ్ఐ

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల డివైఎఫ్ఐ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు వై రాము, జి రామన్న హర్షం వ్యక్తం చేశారు. అయితే, అది చాలదని, మరో మూడేళ్ళు పెంచాలని కోరారు. అలాగే రాతపరీక్ష కాలపరిమితిని సిలబస్‌కు అనుగునంగా కనీసంగా మూడునెలలకు పెంచాలని డిమాండ్ చేశారు.

వెల్లివిరిసిన తెలుగు వెలుగు

ఉత్సాహంగా ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు ప్రారంభం



"కోటిమాటల కోట" పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు, ఇనాక్, బుద్ధ ప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

'స్వభాషను పరిరక్షించుకుందాం - స్వాభిమానాన్ని పెంచుకుందాం' అన్న నినాదంతో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో శుక్రవారం ప్రారంభమైనాయి. సిద్ధార్థ ఆడిటోరియంలో ప్రారంభమైన ఈ మహాసభలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న తెలుగు రచయితలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కృష్ణాజిల్లా తెలుగు రచయితల సంఘం, ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), తానా ప్రపంచ సాహిత్య వేదిక, సిద్ధార్థ అకాడమి (విజయవాడ) సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విశ్వవ్యాప్తంగా తెలుగు గొంతును వినిపించేందుకు మహాసభల ప్రాంగణంలో పలు వేదికలను ఏర్పాటు చేశారు. తొలి తెలుగు ప్రధాని పివి నరసింహారావు వేదిక పైన కవి సమ్మేళనాలు, తెలుగు విశ్వవిద్యాలయ నిర్మాత ఎన్ టి రామారావు వేదికపై సాహితీ సదస్సులు జరిగాయి. ప్రారంభ కార్యక్రమం అనంతరం 'అంతర్జాలంలో తెలుగు' అనే అంశంపై సదస్సు జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు 'కుదురాట కొత్త వెలుగు'పై అద్భుతావధానం నిర్వహించారు. సాయంత్రం తెలుగు వెలుగు పేరుతో సభ నిర్వహించారు. అనంతరం సాహితీ బాంధవులకు పురస్కార ప్రధానోత్సవం నిర్వహించారు. నందమూరి తారక రామారావు వేదికపై పత్రికా ప్రతినిధుల సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి కవి, సంధ్య పత్రిక సంపాదకులు శిఖామణి అధ్యక్షత వహించారు

ప్రజాఉద్యమంతోనే భాషా పరిరక్షణ : వెంకయ్య

భాషా పరిరక్షణ ప్రజా ఉద్యమంతోనే ప్రారంభమవుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు. మహాసభలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇంటినుండే భాషా పరిరక్షణ ఉద్యమం ప్రారంభం కావాలన్నారు. మాతృభాష కళ్ల లాంటివని, ఇంగ్లీషు కళ్లద్దాలు లాంటివన్నారు. కళ్ళు ఉంటేనే కళ్లద్దాలు పనిచేస్తాయని చెప్పారు. ప్రాథమిక విద్య మాతృభాషలో ఉండితీరాలని, ఉన్నత సాంకేతిక విద్యను మాతృభాషలోకి తేవాలని, న్యాయవ్యవస్థలో తీర్పులు తెలుగులో ఉండాలని అన్నారు. మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షోపన్యాసం చేస్తూ, ప్రాచీన భాషా కేంద్రాన్ని నెల్లూరుకు తీసుకొచ్చిన ఘనత వెంకయ్యనాయుడుకే దక్కుతుందని పేర్కొన్నారు. డాక్టర్ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ చీలికలుగా ఉన్న సమాజాన్ని కలిపేశక్తి సాహితీవేత్తలకే ఉందన్నారు. తానా అద్యక్షుడు మిగతా 2లో

సైనికుల మృతి కలచివేసింది : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రోడ్డు ప్రమాదంలో సైనికులు మృతి చెందడం తనను కలచివేసిందని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతికూల పరిస్థితుల్లో సైతం దేశాన్ని, ప్రజల్ని కంటికి రెప్పలా కాపడటానికి సరిహద్దుల వద్ద నిద్రాహారాలు మానడంతో పాటు కుటుంబాలను సైతం దూరంగా పెట్టి అనునిత్యం విధులు నిర్వహించే వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమన్నారు.

కడప ఉక్కు ఫ్యాక్టరీకి బటన్ నొక్కండి


- ముఖ్యమంత్రికి లోకేష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
కడప ఉక్కుఫ్యాక్టరీ పూర్తికావడానికి ఒక సారి బటన్ నొక్కండని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారు. 'ప్రెసిడెంట్ మెడల్ విస్కీ, సాక్షి, భారతి సిమెంట్ కోసం బటన్ నొక్కి కోట్లు నొక్కేసే కోతల రెడ్డి' అని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఆరోపించారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ మూడేళ్లల్లో పూర్తి చేస్తామని శంకుస్థాపన చేసిన రోజు ఇచ్చిన హామీ గుర్తుందా అంటూ ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉక్కు సంకల్పంతో ఫ్యాక్టరీ నిర్మించి 25 వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఇప్పుడు ఉసూరుమనిపించారని ఆయన తప్పుబట్టారు. కన్నతల్లి లాంటి కడపకు, రాజకీయ జీవితం ఇచ్చిన రాయలసీమ గడ్డకు జగన్ తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. 'శంకుస్థాపన చేసిన పనులు పూర్తిచేయడం చంద్రబాబు విజనరీ పాలన అయితే శంకుస్థాపన చేసి మరిచిపోవడం జగన్ ప్రిజనరీ పాలన' అని ఆయన ఎద్దేవా చేశారు. వైసిపి సర్కారు నిర్లక్ష్యం వల్లే కర్నూలు జిల్లా కౌతాళం మండలం హాల్వి స్కూల్ 'నాడు -నేడు' పనుల్లో ప్రమాద ఘటన జరిగిందని పేర్కొన్నారు. నాడు-నేడు పనుల్లో దోపిడీపై పెట్టిన శ్రద్ధ పిల్లల ప్రాణాలపై లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.


తొలి లక్కీడ్రా విజేతలను ప్రకటిస్తున్న బిగ్ సి సిఎండి బాలు చౌదరీ, డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలాజీ రెడ్డి.

బిగ్ సి లక్కీడ్రా విజేతల ఎంపిక

హైదరాబాద్ : ప్రముఖ మొబైల్ రిటైల్ చెయిన్ బిగ్ సి తన 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆఫర్లలో భాగంగా తొలి లక్కీ డ్రాను నిర్వహించింది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన లక్కీ డ్రాలోని విజేతలను ప్రకటించింది. తొలి లక్కీ డ్రాలో ఆరు చొప్పున మారుతి సుజుకి ఆల్టో కార్లు, బజాజ్ ప్లాటినా బైకులు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, టివిల విజేతలను ప్రకటించింది. 30 మంది విజేతలను ఎంపిక చేసింది. వార్షికోత్సవ ఆఫర్‌లో భాగంగా 20 చొప్పున మారుతి సుజుకి ఆల్టో కార్లు, బజాజ్ ప్లాటినా బైకులు, రిఫ్రిజిరేటర్లు, ఎసిలు, టివిలను విజేతాలకు అందించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన వాటి కోసం మరో రెండు దఫాల్లో లక్కీడ్రాను నిర్వహించనున్నట్లు బిగ్ సి సిఎండి బాలు చౌదరీ తెలిపారు. లక్కీ డ్రా విజేతలతో పాటుగా బిగ్ సిలో చేసే ప్రతీ కొనుగోలుపై డిస్కౌంట్‌తో పాటుగా ఖచ్చితమైన బహుమతిని అందిస్తున్నామన్నారు. తొలి లక్కీడ్రాలో సి గోపాల క్రిష్ణా, రితేష్ కుమార్ ఝా, ఎం రాజు, పర్వేజ్ అహ్మద్, లికిత్, అఖిల్ అల్టో కారులను గెలుపొందిన వారిలో ఉన్నారు.



మార్కెట్లకు కరోనా బెంబేలు

రూ.8 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 980 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లను కరోనా భయాలు బెంబేలెత్తిస్తున్నాయి. వరుసగా నాలుగో రోజూ సూచీలు నష్టాలు చవి చూశాయి. అంతర్జాతీయ ప్రతికూల సంకేతాలకు తోడు కరోనా భయాలతో శుక్రవారం సెషన్‌లో బిఎస్ఇ సెన్సెక్స్ 981 పాయింట్లు లేదా 1.6 శాతం పతనమై 59,845కు పడిపోయింది. ఇది అక్టోబర్ 28 నాటి కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఎన్ఎస్ఇ నిఫ్టీ 321 పాయింట్లు లేదా 1.8 శాతం నష్టంతో 17,807కు దిగజారింది. ఒక్క పూటలోనే బిఎస్ఇలో ఇన్వెస్టర్ల సంపద రూ.8 లక్షల కోట్లు తుడుచుకుపెట్టుకుపోయింది. గడిచిన ఏడు సెషన్లలో దాదాపుగా రూ.16 లక్షల కోట్ల సంపద ఆవిరయ్యింది. వారాంతం సెషన్‌లో ఉదయమే ప్రతికూలంగా ప్రారంభమైన మార్కెట్లు రోజంతా అదే బాటలో పయనించాయి. ఏ దశలోనూ కొనుగోళ్ల అండ లభించకపోవడంతో భారీ నష్టాల్ని మూటగట్టుకున్నాయి. రూపాయి బలహీనతలు, చమురు ధరలు పెరగడం, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బిఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాలు వెల్లువ మార్కెట్లను కుదేలు చేశాయి. బిఎస్ఇ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 3 శాతం, 4 శాతం చొప్పున పడిపోయాయి. నిఫ్టీలో పిఎస్‌యు అధికంగా 6 శాతం పడిపోగా.. లోహ సూచీ 4 శాతం, రియాల్టీ 3 శాతం చొప్పున నష్టపోయాయి.

బటన్ నొక్కుడు.. మొత్తం బుక్కుడు

- తాము అధికారంలోకొస్తే గీతకార్మికులకు 20శాతం మద్యం దుకాణాలు
- బొబ్బిలి బహిరంగ సభలో చంద్రబాబు


బొబ్బిలి సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / బొబ్బిలి
బటన్ నొక్కుడు... మొత్తం బుక్కుడు... అన్నట్టుగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పరిపాలన ఉందని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. ప్రజలంతా మాయలో పడి గత ఎన్నికల్లో ఓట్లేశారని, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి భస్మాసురుడై దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. రెండో రోజుల విజయనగరం పర్యటనలో భాగంగా శుక్రవారం బొబ్బిలిలో బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేనివారు మూడు రాజధానులు నిర్మిస్తామంటే ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. జగన్‌కు ఉత్తరాంధ్రపై ప్రేమలేదని, విశాఖ రాజధాని పేరుతో ఈ ప్రాంతంలోని భూములు, ప్రజల ఆస్తులపైనే ఆయనకు ప్రేమ ఉందని ఎద్దేవా చేశారు. పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దాల్సిన విశాఖను గంజాయి హబ్‌గా తయారు చేశారని విమర్శించారు. గంజాయి, డ్రగ్స్ అధికంగా పట్టుబడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఇటీవల కేంద్ర ప్రభుత్వం పేర్కొందన్నారు. ఇటువంటి సంఘ విద్రోహశక్తులు, డ్రగ్స్, గంజాయి మఠాలను వదిలేసి ప్రజలపైనా, ప్రతిపక్ష నాయకులపైనా పోలీసులు ప్రతాపం చూపిస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు డిఎ, పిఎఫ్, జిపిఎఫ్, ఇళ్ల రుణాలు ఇవ్వడం లేదన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక ఇసుక, మద్యం ధరలకు రెక్కలు వచ్చాయని, ఈ అక్రమ సంపాదన తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌కు పోతోందని విమర్శించారు. 27 దళిత పథకాలను రద్దుచేశారని, ఎస్‌టిల జీవితాలను సర్వనాశం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుషికొండపై కన్నేసి బోడికొండగా తయారు చేశారని విమర్శించారు. రాష్ట్రానికి వచ్చిన టాటా, హెచ్ఎస్‌బిసి తదితర పరిశ్రమలు జగన్ పాలనలో వెనక్కి వెళ్లిపోయాయన్నారు. అమరావతిలో రూ.మూడులక్షల కోట్ల సంపద ఆవిరి అయిపోయిందన్నారు. రూ.ఐదు లక్షల్లో 50 శాతం వాటాను మంత్రి అంబటి రాంబాబు ఎందుకు అడిగారో చెప్పాలని, ఆయనపై చర్యలు తీసుకునే ధైర్యం ఉందా?, భూముల కబ్జాకు పాల్పడిన మంత్రి జైరాంపై చర్యలు తీసుకునే ధైర్యం సిఎంకు ఉందా? అని ప్రశ్నించారు. అంతకుముందు రాజాంలో బిసి నాయకులతో సమావేశమయ్యారు. బిసిల కోసం గతంలో టిడిపి అమలు చేసిన పథకాలను వైసిపి నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తాను అధికారంలోకి వస్తే 20శాతం మద్యం దుకాణాలను గీత కార్మికులకు కేటాయిస్తానని అన్నారు. పెరుమాలి, తెర్లాం మీదుగా బొబ్బిలి వరకు చంద్రబాబు రోడ్‌షో నిర్వహించారు.

మార్గమధ్యంలో బాడంగి మండలం రేజేరు బెల్లం క్రషర్ల వద్ద చెరకు రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆర్‌విఎస్‌కెకె రంగరావు, మాజీ మంత్రి ఎస్‌విఆర్‌కె సుజయ్ కృష్ణరంగారావు, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు పాల్గొన్నారు.

తడబడిన చంద్రబాబు

సైకో పాలన పోవాలనే బదులు సైకిల్ పాలన పోవాలి అని చంద్రబాబు తడబాటుకు గురయ్యారు. ఆ తర్వాత సర్దుకుని క్షమాపణ చెప్పారు. సైకో పాలన పోవాలని అన్నారు.

మూడున్నరేళ్లలో వ్యవసాయంపై రూ.85 వేల కోట్లు ఖర్చు

- అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో చంద్రబాబునాయుడు హయాంలో వ్యవసాయరంగం నిత్యం కరువుకాటకాలతో రైతులు ఇబ్బందులు పడితే జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వ్యవసాయాన్ని పండుగలా భావిస్తున్నారని వైసిపి రైతు విభాగం అధ్యక్షులు, అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్రకార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ మూడున్నరేళ్ల కాలంలో వ్యవసాయంపై రూ 85,295.98 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వ్యవసాయ ఉత్తత్తుల కొనుగోలు కోసమే రూ.51,662 కోట్లు ఖర్చుచేసిందన్నారు. టిడిపి హయాంలో ఎన్నడూ వ్యవసాయంపై ఇంత ఖర్చు పెట్టలేదన్నారు. ఆహారధాన్యాల ఉత్పత్తిలో గతంలో ఐదేళ్లలో 153 లక్షల టన్నులు ఉత్పత్తి అయితే ప్రస్తుత ప్రభుత్వ హయాంలో మూడేళ్లకే 167 లక్షల టన్నుల ఉత్తత్తి వచ్చిందన్నారు. ఉద్యానవన పంటలకు సంబంధించి టిడిపి హయాంలో 228 లక్షల టన్నుల ఉత్పత్తి వస్తే వైసిపి ప్రభుత్వ హయాంలో 332 లక్షల టన్నులు వచ్చిందని తెలిపారు.


సూర్యమోహన్ రెడ్డి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న సి.హెచ్. బాబురావు, సుంకర రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ముగిసిన డాక్టర్ సూర్యమోహన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-విజయవాడ
ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ బొమ్మారెడ్డి సూర్యమోహన్ అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు ఆయనకు కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికారు. కృష్ణలంకలోని స్వర్గపురి స్మశాన వాటికలో దహన సంస్కారాలు జరిగాయి. బెంగళూరులో గురువారం ఉదయం ఆయన గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. అక్కడ నుంచి మృతదేహాన్ని విజయవాడలోని సీతారాంపురంలో గల బొమ్మారెడ్డి స్వగృహానికి తీసుకొచ్చిన సూర్యమోహన్ భౌతికకాయంపై పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, రాష్ట్ర కమిటీ సభ్యులు, ఎంబి విజ్ఞాన కేంద్రం సెక్రటరీ పిన్నమనేని మురళీకృష్ణ, ఐలు రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి ఒ శాంతి, ప్రజాశక్తి ఎడిటోరియల్ బోర్డు సభ్యులు గడ్డెన్న, ప్రజాశక్తి బాధ్యులు ఒ శ్రీనివాసరావు, ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె సరోజ, విజయవాడ



రైల్వే వైద్యశాల సిఎంఒ డాక్టర్ సాయిచంద్, సహచరుడు డాక్టర్ వెంకటరెడ్డి, సీనియర్ న్యాయవాది వి.రఘు, ప్రజాశక్తి న్యూస్ ఎడిటర్ వి.రాజగోపాల్‌శర్మ తదితరులు ఆయనకు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూర్యమోహన్ అంత్యక్రియల్లో ఆయన కుమారులు భాస్కర్, చంద్‌తో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు డాక్టర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'చలో మాచర్ల' భగ్నం

- పలువురు టిడిపి నేతల అరెస్టు విడుదల


రోడ్డుపై బైఠాయించిన పత్తిపాటి పుల్లారావు, జి.వి.ఆంజనేయులు, శ్రీధర్

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి
తెలుగుదేశం పార్టీ చేపట్టిన చలో మాచర్ల కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారు. పల్నాడు జిల్లా మాచర్లలో ఇటీవల టిడిపి నేతలపై దాడులను నిరసిస్తూ శుక్రవారం ఆ పార్టీ నేతలు చలో మాచర్లకు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మాచర్ల కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించుకుని వేర్వేరు మార్గాల ద్వారా పిడుగురాళ్ల, గురజాలకు చేరుకున్న నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాచర్లలో 144 సెక్షన్ అమలులో ఉన్నందున బయట వ్యక్తులను అనుమతించబోమని తెలిపారు. గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లి వద్ద మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావును అడ్డుకున్నారు. దీంతో వారురోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. గుంటూరు జిల్లా టిడిపి నాయకులు చిట్టాబత్తిన చిట్టిబాబు, మానుకొండ శివప్రసాద్, దారునాయక్‌ను గురజాలలో అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును పిడుగురాళ్లలోనే నిలిపివేశారు. పోలీసుల ఆంక్షలను పట్టించుకోకుండా ఆయన తన అనుచరులతో కొంత దూరం వెళ్లారు. దీంతో పోలీసులు వెంబడించి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, యరపతినేని అనుయాయులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో ప్రధాన రహదారిపై టిడిపి కార్యకర్తలు సిఎం జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. గుంటూరు నుంచి మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పోలీసులను తప్పించుకుని మాచర్లకు బయలుదేరగా నగరంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. పొన్నూరులో మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు. అరెస్టు చేసిన నేతలను సాయంత్రం విడుదల చేశారు.

9 మంది టిడిపి కార్యకర్తల అరెస్టు

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)
పల్నాడు జిల్లా మాచర్లలో ఈ నెల 16న వైసిపి-టిడిపి మధ్య ఘర్షణలో పలువురు గాయాలవగా, కార్లు దహనమయ్యాయి. టిడిపి కార్యాలయానికీ నిప్పు పెట్టారు. మరో రెండు ఇళ్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఇరు పార్టీలకు చెందిన వారిపై పలు కేసులు నమోదయ్యాయి.

ఈ కేసులకు సంబంధించి టిపిపి నాయకులపై హత్యాయత్నంతోపాటు పలు కేసులు నమోదు చేశారు. టిడిపికి చెందిన వజ్రం నాయక్‌ను పోలీసులు గురువారం అరెస్టు చేయగా, శుక్రవారం మరో 9 మందిని అరెస్టు చేశారు. వీరిని పోలీసు బందోబస్తు నడుమ మాచర్లలో న్యాయమూర్తి ఎదుట రాత్రి ఏడు గంటల సమయంలో హాజ రుపరిచారు. జడ్జి వారికి రిమాండ్ విధించారు.


న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చేందుకు అరెస్టు చేసిన వారిని వాహనంలో తీసుకెళ్తున్న పోలీసులు

వెల్లివిరిసిన తెలుగు వెలుగు

(మొదటి పేజీ తరువాయి)

అంజయ్యచౌదరి మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి చేస్తోన్న సేవలను వివరించారు. తానా చైతన్య సాహితీ వేదిక కన్వీనరు ప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషను విస్మరిస్తే భావి తరాలు క్షమించవచ్చన్నారు. ఫ్రాన్స్ దేశస్తుడు డానియల్ నెగర్స్ మాట్లాడుతూ మాతృభాషను రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కూచిబొట్ల ఆనంద్ మాట్లాడుతూ స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో తెలుగును ఒక విదేశీ భాషగా గుర్తింపునిచ్చారని తెలిపారు. గుగూల్‌లో ట్రాన్స్‌లేట్‌లో తెలుగు భాష మెరుగుపరచేందుకు "కోటిమాటల కోట" అనే పుస్తకాన్ని తెస్తున్నామన్నారు. ఈ పుస్తకాన్ని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమానికి ముందుగా సినీ నటుడు కైకాల సత్యనారాయణ మృతికి రచయితల సంఘం ఒక నిమిషం మౌనం పాటించింది.

భాషా సంస్కృతుల పరిరక్షణకు నడుం కట్టాలి : ఎన్‌వి రమణ

సామాజిక, వ్యక్తిగత విలువలు భాషా సంస్కృతులతో ముడిపడి ఉంటాయని, వాటిని కాపాడుకోవడానికి కవులు, రచయితలు, కళాకారులు నడుం బిగించాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ పిలుపునిచ్చారు. 'తెలుగు వెలుగు' అనే అంశంపై సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తెలుగు అనుసంధానం జరగాలంటే భాషలో ఆధునీకత ఉండాలన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భాషలో మార్పులు రావాలన్నారు.

రాజకీయాల కోసమే : విజయబాబు విమర్శ

భాషను వేదికగా చేసుకుని రాజకీయాలు చేయడం సరికాదని రాష్ట్ర తెలుగు అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు అన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలుగు భాషకు ఏమైందని 'స్వభాషను రక్షించుకుందాం స్వాభిమానం పెంచుకుందాం' నినాదంతో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. కార్పొరేట్ పాఠశాలల దోపిడీ నుంచి నిరుపేద కుటుంబాలను కాపాడేందుకు ప్రభుత్వం 'ఆంగ్ల మాధ్యమం' వంటి విప్లవాత్మక సంస్కరణలను విద్యారంగంలో అమలు పరుస్తుందన్నారు. దీనిని బూచిగా చూపిస్తూ దుష్ప్రచారానికి ఒక వేదిక అని విమర్శించారు. కాగా సాహిత్య అకాడమీ పురస్కారాలు పొందిన ప్రముఖ తెలుగు రచయితలు మధురాంతకం నరేంద్ర, వారాల ఆనంద్‌కు తెలుగు అధికార భాషా సంఘం తరపున విజయబాబు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు జి ఆంజనేయులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి రానున్న కాలంలో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 680వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ కోక్ ఓవెన్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా దీక్షలు కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేకపోవడం శోచనీయమన్నారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలతో స్టీల్‌ప్లాంట్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోందని తెలిపారు. ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు కార్మికులు కంకణం కట్టుకున్నారన్నారు. వారంతా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమం వైపు మళ్లించాలని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు తాంద్ర కనకరాజు, రమణాజీ, కె.శ్రీనివాసరావు, జి.ఆనంద్ పాల్గొన్నారు.

తెలుగు ప్రజానీకానికి తీరనిలోటు

- కైకాల మృతికి గవర్నర్, సిఎం ప్రభృతుల సంతాపం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
సినీ నటుడు కైకాల సత్యనారాయణ మృతి పట్ల రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభృతులు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కైకాల మృతి తెలుగు ప్రజలకు తీరని లోటు అని వారు పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమలో తన నటనా కౌశలంతో ప్రత్యేక ముద్ర వేయడమే కాకుండా ప్రజా ప్రతినిధిగా పార్లమెంటులో ప్రజాసమస్యలపై తన వాణిని వినిపించారని విశ్వభూషణ్ కొనియాడారు. గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి కైకాల అని జగన్ గుర్తు చేసుకున్నారు. నటునిగా సుదీర్ఘ కాలం ఎన్నో మరపురాని పాత్రలతో మెప్పించారని కొనియాడారు. ఎంపీగానూ ప్రజలకు మరింత దగ్గరయ్యారని పేర్కొన్నారు.

తిరుగులేని నటుడు కైకాల : చంద్రబాబు

ప్రజ్ఞాపాటవాలతో సినీ, రాజకీయరంగంలో అశేషాభిమానుల్ని సంపాదించుకున్న కైకాల మరణం తెలుగుజాతికి తీరనిలోటు అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్ అంటే కైకాల సత్యనారాయణే అనేంతగా ఆయన తన నటనతో అశేషాభిమానుల్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. 60 ఏళ్ల పాటు చిత్రపరిశ్రమలో తిరుగులేని నటుడిగా ఖ్యాతినార్జించారని తెలిపారు.

సిపిఎం సంతాపం

కైకాల సత్యనారాయణ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో సత్యనారాయణ పలు విభిన్నమైన పాత్రలు పోషించారని తెలిపారు. పార్లమెంటు సభ్యులుగా సేవలందించారని, ఆయన మరణం సినీ రంగానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

- పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాల్లో పలు విభిన్నమైన పాత్రలు పోషించి కైకాల మెప్పించారని సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మరో ప్రకటనలో సంతాపం తెలిపారు. నంది అవార్డుతో సహా పలు సినీ అవార్డులు ఆయనకు మణిహారంగా మారాయని పేర్కొన్నారు. ఎంపీగా రాజకీయ జీవితంలోనూ సేవలందించారని తెలిపారు.

టిడిపి కార్యాలయంలో నివాళి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కూడా వేరు వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. టిడిపి కార్యాలయంలో కైకాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. తెలుగు సినీవినీలాకాశం ఒక గొప్ప ధ్రువతారను కోల్పోవడం విచారకరమని టిడిపి ఎమ్మెల్యే, నటులు నందమూరి బాలకృష్ణ మరో ప్రకటనలో తెలిపారు.

అభ్యంతరాలకు ఫీజు రూ.100

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) నిర్వహించే పరీక్షల ప్రశ్నలు, వాటి సమాధాన పత్రాలపై అభ్యంతరాలు చెబితే అభ్యర్థుల నుంచి రూ.100 వసూలు చేయాలని నిర్ణయించినట్లు కమిషన్ కార్యదర్శి హెచ్ అరుణ్ కుమార్ శుక్రవారం ప్రకటించారు. ప్రశ్నాపత్రాలు, సమాధాన పత్రాల 'కీ'లపై అభ్యంతరాలు వేలాల్లో ఉంటున్నాయని, దీనివల్ల పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యమవుతోందని తెలిపారు. ఇక నుంచి అభ్యంతరాలు తెలిపేందుకు రూ.100 వసూలు చేయాలని నిర్ణయించిన్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ అభ్యర్థి లేవనెత్తిన అభ్యంతరం సరైందని తేలితే తుది విశ్లేషణలో అభ్యర్థికి తిరిగి చెల్లిస్తామని తెలిపారు.

'హైడ్రో' పేరుతో అడవులు అదానీపరం

(మొదటి పేజీ తరువాయి)

నిధుల్లో సగం కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ పునరుద్ధరణ, అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ప్రత్యేక నిధులు కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

కాఫీ రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఐటిడిఎ కాఫీ ప్రాజెక్టుకు సంబంధించి గత నాలుగు సంవత్సరాల నుంచి కూలి డబ్బుల బకాయి సుమారు రూ.60 కోట్లు అందకపోవడంతో 43,247 మంది కాఫీ రైతులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని శ్రీనివాసరావు తెలిపారు. కిలో పార్చ్‌మెంట్ కాఫీకి రూ.500, చెర్రీ కాఫీకి రూ.300, మిరియాలుకు రూ.1000 గిట్టుబాటు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒ తన ఇష్టానుసారం కిలో కాఫీ పండ్లకు రూ.36 ధర ప్రకటించడం ప్రభుత్వ దోపిడీకి నిదర్శనమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్గానిక్ కాఫీగా ప్రాచుర్యం పొందినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదరణ లేక గిరిజన రైతులు అన్యాయానికి గురవుతున్నారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ చర్మవ్యాధులతో గిరిజన విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా ఐటిడిఎ కనీస నివారణ చర్యలు చేపట్టలేదన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థుల కోసం సామాజికవేత్తలు నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలకు సైతం అనుమతి ఇవ్వకుండా ఆశ్రమ పాఠశాలలను నిర్బంధాల మధ్య కొనసాగించడం భావ ప్రకటనా స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. సమావేశంలో పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లో సురేంద్ర పాల్గొన్నారు.

జనవరిలో కడప 'ఉక్కు' నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఆదిమూలపు సురేష్, కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రనాథరెడ్డి, రఘురామిరెడ్డి, సుధీర్‌రెడ్డి, మేడా మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సుధారాణి, శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక పెద్ద దర్గా

తొలుతకడపలోని అమీన్‌పీర్ పెద్ద దర్గాను ముఖ్యమంత్రి సందర్శించారు. దర్గా పీఠాధిపతి హరిపుల్లా హుస్సేని తదితరులు ఆయనకు దర్గా సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం ముజావర్లు పూలు, వస్త్ర చాదర్, సుగంధ పరిమళాల అత్తరుతో కూడిన తట్టను ముఖ్యమంత్రికి అందజేశారు. దీనిని తలపై పెట్టుకుని దర్గాలోకి జగన్ వెళ్లి సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గా గ్రంథాలయంలో ముఖ్యమంత్రికి దర్గా విశిష్టత, ప్రాశస్త్యాన్ని, చారిత్రక వైభవాన్ని పీఠాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ఈ దర్గా వెలుగొందుతోందన్నారు. ఈ దర్గా ఖ్యాతి ప్రపంచ వ్యాప్తంగా విస్తారిస్తోన్నదంటే దీనికి మూలం కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యంగా భాగస్వామ్యం కావడమేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

సిక్కింలో ఘోరం

(మొదటి పేజీ తరువాయి)

పడటంతో వాహనం తునాతునకలైంది. తీవ్రంగా గాయపడిన వారిని హెలికాప్టర్లలో సిలిగురిలోని ఆస్పత్రికి తరలించారు.

బాధాకరం : రాష్ట్రపతి

ప్రమాదంలో సైనికులు మృతి చెందడం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో వీర జవాన్లను కోల్పోవడం బాధాకరమని రాష్ట్రపతి పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రధాని సానుభూతిని తెలియచేశారు. . సైనికుల మృతి పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారుబాధిత కుటుంబాలకు భారత సైన్యం బాసటగా నిలుస్తోందని లెఫ్టినెంట్ కల్నల్ రావత్ పేర్కొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నరసింహను పలుకరిస్తున్న సిఎం జగన్

మానవత్వం చాటుకున్న సిఎం

- నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలునికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

ప్రజాశక్తి- కడప

కడప పర్యటనలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. భూమాయపల్లె గ్రామానికి చెందిన రోజుకూలీ ఓబులేసు ముఖ్యమంత్రిని కలిసి తన కుమారుడు నరసింహ (12 సంవత్సరాలు) నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని వివరించారు. వైద్యం చేయించేందుకు ఆర్థిక స్తోమతలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీల్ ఛైర్‌లో ఉన్న ఆ బాలుడి పరిస్థితిని ముఖ్యమంత్రి గమనించారు. బాలుడి కుటుంబానికి వెంటనే లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేయాలని, నరసింహకు మెరుగైన చికిత్స అందించాలని, ఎంత ఖర్చయినా వెనుకాడవద్దని, ఎక్కడైనా సరే వైద్యం చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఆర్టీసి ఉద్యోగులకు బకాయిలను చెల్లించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్ డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు



విజయవాడలోని నెహ్రూ బస్టాండ్‌లో ఉద్యోగులు, కార్మికులతో కలిసి నిరసన తెలుపుతున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలన్నింటిని తక్షణం చెల్లించాలని ఎపిపిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి ఉద్యోగులు, కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, డిపోల వద్ద శుక్రవారం నాడు వివిధ రూపాల్లో ఆందోళన చేపట్టారు. ధర్నాలు, గేట్ మీటింగ్‌లతో నిరసన తెలియజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు యజమాన్యం ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలని నినదించారు. సిఎఫ్‌ఎంఎస్‌లో పెండింగ్‌లో వున్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను తక్షణం చెల్లించాలని, ఓడిలు, అలవెన్స్‌లను ఇవ్వాలని కోరారు. పదోన్నతులు పొందిన 2096 మందికి పిఆర్‌సి అమలు చేయాలని, అద్దెబస్‌ల పేరుతో ప్రైవేటీకరణ చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఈ ధర్నాలను జయప్రదం చేసిన ఆర్‌టిసి ఉద్యోగులకు, కార్మికులకు ఎస్‌డబ్ల్యుఎఫ్ తరపున ఫెడరేషన్ రాష్ట్ర ప్రచారకార్యదర్శి టి పట్టాభిరామ్ దొర ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు.

విజయవాడ కేంద్రంలో జరిగిన ఆందోళనలో ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని భాష, ఏలూరులో రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, నెల్లూరులో రాష్ట్ర ప్రధానకార్యదర్శి అయ్యపరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, కష్ణారావు, కర్నూలులో కోశాధికారి జె దివాకర్, విశాఖపట్నంలో రాష్ట్ర కార్యదర్శి సీతామాలక్ష్మి, విజయనగరంలో రాష్ట్ర కార్యదర్శి వి రాములు, గుంటూరులో రాష్ట్ర ఉపాధ్యక్షులు రవిశంకర్, రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్, తిరుపతిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం : అప్పలరాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతుల శ్రేయస్సే అంతిమ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పశుసంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పశు సంవర్ధక శాఖ సాధించిన ప్రగతిని సచివాలయంలో శుక్రవారం విలేకరులకు వివరించారు. రాష్ట్రంలో 42 లక్షల కుటుంబాలు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పరంగా వీరందరికీ అన్ని విధాలుగా లబ్ధిచేకూర్చి తద్వారా జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో వినూత్న పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు.

గత ఆర్థిక సంవత్సరంలో పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో మూడోవంతు ఆదాయం పశుసంవర్ధక శాఖ ద్వారా సమకూరిందని చెప్పారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా పలు రకాల సేవలను రాష్ట్రప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. వైఎస్ఆర్ చేయూత - జగనన్న పాలవెల్లువ, జగనన్న జీవక్రాంతి పథకాల ద్వారా లక్ష్యాలను అధిగమిస్తూ పెద్దఎత్తున పశువుల పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజారోగ్యానికి ఇస్తున్న ప్రాధాన్యాతను పశువుల ఆరోగ్యానికి కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఆర్‌బిసి ఎఇ ఇంట్లో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా పరిధిలోని శ్రీశైలం రైట్‌బ్యాంకు కెనాల్ (ఎస్ఆర్‌బిసి) ఎఇగా పనిచేస్తున్న మానిపాటి చంద్రుడు ఇంట్లో ఎసిబి అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచారంతో ఆయన ఇంటితో పాటు కోయిలకుంట్లలోని చంద్రుడు బంధువులు, సోదరుల ఇళ్లల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఆదాయానికి మించి రూ.2.52 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారని అధికారులు గుర్తించారు. ఇందులో ఎనిమిది ప్లాట్లు, రెండు ఇళ్లు, పదెకరాల భూమి, ఎనిమిది తులాల బంగారం గుర్తించారు.

అప్పుల బాధలో యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-వెల్దుర్తి (కర్నూలు)

అప్పుల బాధ తాళలేక యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. చెరుకులపాడు గ్రామానికి చెందిన రైతు బాలస్వామి (35)తన మూడెకరాల సొంత పొలంతో పాటు మరో ఎకరాను కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. మాండూస్ తుపాను ప్రభావంతో వరి పంట దెబ్బతిన్నది. పంట సాగు, కుటుంబ పోషణ కోసం సుమారు రూ. ఏడు లక్షలు అప్పు చేశారు. పంట మొత్తం దెబ్బతిన్నడం, అప్పుల తీరే దారి లేక తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అత్యుత్తమ సదుపాయాలతో శ్రీ బాలాజీ కేన్సర్ ఆస్పత్రి

వైవి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

తిరుపతిలో శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ (కేన్సర్ ఆస్పత్రి)ని నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది దసరా నాటికి ముఖ్యమంత్రి ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి తెలిపారు. అత్యుత్తమ సదుపాయాలు, చికిత్సలు అందించేలా స్విమ్స్‌కు అనుబంధంగా టిటిడి ఆధ్వర్యంలో ఈ ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. కేన్సర్ ఆస్పత్రి ప్రగతిపై శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఏ ఒక్కరూ కేన్సర్‌తో మరణించరాదనే ఉద్దేశంతో రాష్ట్రంలో తిరుపతి, గుంటూరు- విజయవాడ మధ్య, విశాఖపట్టణంలోనూ కేన్సర్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని సిఎం నిర్ణయించారని గుర్తు చేశారు. మొదట ఆస్పత్రిని తిరుపతిలో నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం కేన్సర్ చికిత్సల ప్రముఖ వైద్యులు డాక్టరు నోరి దత్తాత్రేయుడును సలహాదారుగా నియమించారని తెలిపారు. ఆస్పత్రి భవనాలకు సంబంధించి ఢిల్లీ, చెన్నై నగరాలకు సంబంధించిన కన్సల్టెంట్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టరు నోరి దత్తాత్రేయుడు, స్విమ్స్ డైరెక్టరు వెంగమ్మ, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్‌కుమార్, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేకాధికారి డాక్టరు హరికృష్ణ, కేన్సర్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టరు జయచంద్ర పాల్గొన్నారు.

కార్పొ'రేట్ల' ఫలితమే మాంద్యం

'ప్రపంచ ఆర్థిక మాంద్యం-పరిష్కారాలు'పై సదస్సులో మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ



మాట్లాడుతున్న ఎంవిఎస్ శర్మ

ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

కార్పొరేట్ శక్తుల వ్యాపార విన్యాసాల ఫలితమే ఆర్థిక మాంద్యమని, తద్వారా ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి నానాఅవస్థలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. 'ప్రపంచ ఆర్థిక మాంద్యం-కారణాలు-పరిష్కారాలు' అనే అంశంపై సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. మహాసభ ఆహ్వాన కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో ఎంవిఎస్.శర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 20 కార్పొరేట్ కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు రుణాలు రద్దు చేసిందని, దేశవ్యాప్తంగా కోట్ల మంది రైతుల రుణాలు రూ.ఆరు లక్షల కోట్లు ఉంటే వాటిని కట్టి తీరాలని చెప్పడం ఈ పాలకులకే చెల్లిందన్నారు. దేశంలో కోటీ 50 లక్షల మంది రైతులు వ్యవసాయం వదిలి పట్టణాలకు వలస పోయారని, పనుల్లేక కూలీలు కూడా పట్టణాల బాట పట్టారన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. కరోనా సమయంలో గ్రామాల్లో ఉపాధి హామీ పనులతోనే కూలీల కుటుంబాలు పొట్ట నింపుకున్నాయని గుర్తు చేశారు.

కార్పొరేట్ శక్తులు రాయితీల పేరుతో దోచిన డబ్బు రూ.80 లక్షల కోట్లు విదేశాల్లో దాచిపెట్టి, ఇక్కడ కొనుగోలు శక్తి లేదని సాకుగా చూపుతూ పెట్టుబడులకు నిరాకరిస్తున్నారని తెలిపారు. ప్రజల భవిష్యత్‌కు భరోసాగా ఉంటుందని ఎంతోమంది ఎల్‌ఐసిలో పెట్టుబడులు పెట్టిన రూ.8 లక్షల కోట్లను కేవలం రూ.ఐదు లక్షల కోట్లకే అమ్మేందుకు కేంద్రం పావులు కదుపుతోందని తెలిపారు. యువత ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించకపోతే ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతుందన్నారు. సదస్సులో భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మానేపల్లి సూర్యనారాయణ గుప్త, ప్రముఖ న్యాయవాది కె.సత్యాదేవి, యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిన్ని బాబూరావు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు బి.బలరాం, సిఐటియు, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

'బైజూస్'తో విద్య వ్యాపారీకరణ

- సిపిఎం మాజీ ఎంపి మధు విమర్శ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

బైజూస్‌తో విద్యను రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారీకరణగా మార్చేస్తోందని సిపిఎం మాజీ ఎంపి మధు అన్నారు. తిరుపతి యశోదానగర్‌లోని ఎంబి భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బైజూస్ దోపిడీ యథేచ్ఛగా సాగేలా సిఎం ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. పిల్లలకు ట్యాబ్‌లు ఇవ్వడానికి తాము వ్యతిరేకం కాదని, బైజూస్‌ను ప్రోత్సహించి తల్లిదండ్రులు, విద్యార్థుల దగ్గర డబ్బులు దోచుకోవడం సరైన విధానం కాదన్నారు. రిలయన్స్, బైజూస్, అమూల్ కంపెనీలకు ప్రభుత్వ నిధులను ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వపాలన అస్తవ్యస్తంగా తయారయ్యిందన్నారు. ఎంపిటిసి, జడ్‌పిటిసి, సర్పంచ్ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నారని విమర్శించారు. సచివాలయాలను తీసుకొచ్చి 'స్థానిక' వ్యవస్థను నిర్వీర్యం చేశారని చెప్పారు. రాష్ట్రంలో సహకార రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి గుజరాత్‌కు చెందిన 'అమూల్' సంస్థకు చిత్తూరు డెయిరీని అప్పగించడం దుర్మార్గమన్నారు. అమూల్ ద్వారా వచ్చే ఒక్క రూపాయి కూడా రాష్ట్ర ప్రజల సంక్షేమానికి ఉపయోగపడదని చెప్పారు.

రైతులను, కార్మికులను దగా చేసిన రాష్ట్ర కార్మిక మంత్రి జయరామ్, నీటి పారుదల శాఖా మంత్రి అంబటి రాంబాబులను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ.. మాండూస్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా రూ.226 కోట్లు నష్టం వాటిల్లిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రూ.500 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని తమ బృందం అంచనా వేసిందని తెలిపారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం చెల్లించా లని డిమాండ్ చేశారు. తాము కార్పొరేషన్‌లో చేరితే భవిష్యత్ ఉండదని టిటిడిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించకుంటే జనవరి తరువాత ఉద్యమ కార్యాచరణ

- ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉద్యోగులకు, పెన్షనర్లకు డిఎ బకాయిలు, బిల్లులు చెల్లించకుంటే జనవరి తరువాత అవసరమైతే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పిఆర్‌సి కోసం ఆందోళన చేపట్టిన సమయంలో ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి 27 శాతం ఐఆర్, 23 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని తెలిపిందన్నారు. డిఎలన్నీ ఒకేసారి ఇస్తున్నట్లు చూపించి గతం కంటే ఎక్కువ జీతం వచ్చేలా లెక్కలు చూపించారని, ఆ డిఎలు ఈ రోజు వరకూ అరియర్స్ రూపంలో ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. జిపిఎఫ్ ఖాతాల్లో డబ్బులు పడి మాయమయ్యాయని, మా డబ్బులు ప్రభుత్వం వాడుకున్నట్లు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించారని తెలిపారు. రిటైర్ అయిన వారికి అరియర్స్ ఇవ్వాల్సి ఉందన్నారు.

డబ్బులు ఇవ్వకుండా ఆదాయ పన్నులో కోత విధించడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. సిఎఫ్‌ఎంఎస్ భూతాన్ని తీసుకొచ్చి ఆర్థిక శాఖ అధికారుల చేతుల్లో బిల్లులన్నీ పెట్టుకున్నారని విమర్శించారు. ఒకటో తేదీనే పెన్షన్, జీతం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను, కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సరెండర్ లీవులు ఇవ్వాలని, ఫీల్డ్ సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని, సచివాలయ ఉద్యోగులకు స్పౌస్ బదిలీలకు అవకాశం ఇవ్వాలని, ఉద్యోగోన్నతులకు ఛానల్ ఏర్పాటు చేయాలని, పబ్లిక్ సెక్టార్, యూనివర్సిటీ నాన్ టీచింగ్ సిబ్బందికి రిటైర్మెంట్ వయసు పెంచాలని కోరారు. సమావేశంలో ఎపిఎన్‌జిఒ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంగళరెడ్డి, కార్యదరి వి.జవహర్ లాల్ పాల్గొన్నారు.

టిటిడి ఇన్‌ఛార్జి ఇఒగా అనిల్ కుమార్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఇన్‌ఛార్జి ఇఒగా అనిల్‌కుమార్ సింఘాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బంగారు వాకిలి వద్ద ప్రమాణం చేశారు. జనవరి రెండు వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డి కుమారుడు ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అనిల్‌కుమార్ సింఘాల్ ఇన్‌ఛార్జి ఇఒగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సివిఎస్ఒ నరసింహ కిషోర్, డిప్యూటీ ఇఒలు కస్తూరి బాయి, రమేష్ బాబు, హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

పోరాట ధీర ఆఫ్ఘన్ మహిళ

ఆఫ్ఘనిస్తాన్‌లో విశ్వవిద్యాలయాల్లో మహిళల విద్యను నిషేధిస్తూ అక్కడి తాలిబన్లు నిర్ణయించడం అత్యంత గర్హనీయం. తాలిబన్ అంటే పష్తో భాషలో విద్యార్థి అని అర్థం. అమెరికా నేర్పిన పాఠాలను ఒంటబట్టించుకున్న సాయుధ తాలిబన్లు ఇప్పుడు మహిళల విద్యను తొక్కిపడుతున్నారు. తాలిబన్ల పుట్టుక, పెరుగుదల అంతా అమెరికా ఒడిలోనే జరిగిందన్నది జగమెరిగిన సత్యం. దశాబ్దాల పాటు సాగిన సామ్రాజ్యవాద, సైనిక కూటమి నిరంకుశ పాలన నుంచి స్వీయ పాలన దిశగా అడుగులు వేయాల్సిన ఆఫ్ఘనిస్తాన్ మతఛాందసవాదుల చేతిలో చిక్కుకోవడంతో ఆఫ్ఘన్ మహిళల పరిస్థితి పెనం మీదినుంచి పొయ్యిలో పడిన చందమైంది. అమెరికా అనుంగు పాలకులు ఆఫ్ఘన్ నుంచి పలాయనం చిత్తగించాక.. సాయుధ తాలిబన్లు పాలనా పగ్గాలు చేపట్టారు. ఆఫ్ఘనిస్తాన్‌ను ఇస్లామిక్ ఎమిరేట్స్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్‌గా ప్రకటించిన తాలిబన్లు తమ ప్రభుత్వం మహిళల హక్కులను గౌరవిస్తుందని హామీ ఇచ్చారు. అయితే, షరియత్ చట్ట పరిధిలోనే అంటూ మెలిక పెట్టడంతో ఆ హామీలు నీటి మీద రాతల వంటివేనని అప్పుడే తేలిపోయింది. 1990లలో తాలిబన్ల అరాచకాలను ప్రత్యేకించి మహిళలు, ఆదివాసీ మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని సాగించిన దాడులను, అణచివేత చర్యలను ప్రత్యక్షంగా చూసిన అంతర్జాతీయ సమాజం, మహిళా సంఘాలు ఆఫ్ఘన్‌లో తాలిబన్ల పాత పాలన పునరావృతమవుతుందంటూ వెలిబుచ్చిన ఆందోళన సరైనదేనని తాజా పరిణామాలు రుజువు చేస్తున్నాయి.

ఆఫ్ఘన్ మహిళలకు ఈ విధమైన ఆంక్షలు, అణిచివేత చర్యలు కొత్తేమీ కాదు. 1996-2001 మధ్య తాలిబన్ల ఏలుబడిలో వీరు తీవ్ర అణచివేతకు గురయ్యారు. ఆ తర్వాత అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమి పాలనలో మహిళలు, ఆదివాసీలపై హింస మరింతగా పెచ్చరిల్లింది. నాటో కూటమి సైనికుల దాష్టీకాలకు మహిళలే ఎక్కువగా సమిధలయ్యారు. మానవ హక్కులను అమెరికా సైన్యం అడుగడుగునా మంట గలిపింది. వీరికంటే తాలిబన్లే నయమనిపించేంతగా అకృత్యాలు సాగించారు.

ఆసియాలో ప్రజాస్వామిక, సామ్యవాద ఉద్యమాలపై కక్ష కట్టిన అమెరికన్ సామ్రాజ్యవాదమే తాలిబన్ల వంటి మితవాద, తిరోగమన, మతతత్వ శక్తులకు ఆర్థికంగానూ, సైనికంగానూ, రాజకీయంగానూ ఊతమిచ్చి ఎగదోసింది. ఆఫ్ఘనిస్తాన్‌లో బాలికలకు విద్య దక్కడం లేదంటూ అమెరికా, బ్రిటన్ తదితర నాటో సభ్య దేశాలన్నీ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాయి. ఈ అరాచకాలకు విత్తులు నాటింది...కాలనాగు లాంటి తాలిబన్లను పెంచి పోషించింది.. .అమెరికాయేనన్న విషయం ఎవరికీ తెలియనిది కాదు. సౌదీ అరేబియా, యుఎఇ వంటి ఇస్లామిక్ దేశాలతో పాటు భారత్ కూడా తాలిబన్ల చర్యను ఖండించింది. కానీ బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సంఘ్ పరివార్ కనుసన్నల్లో చేస్తున్నదేమిటి? మహిళల హక్కులను కాలరాస్తూ అది సాగిస్తున్న అరాచకాలు.. తాలిబన్ల చర్యలకు ఏమాత్రం తీసిపోనివి. దేశ రాజధానిలో మహిళలను ముక్కలుముక్కలు కోసి చంపేస్తున్నా మోడీ సర్కార్‌కు ఆడబిడ్డల రక్షణ పట్టడం లేదు. బేటీ బచావో..బేటీ పఢావో అన్నది నినాదాలకే పరిమితమౌతోంది. విశ్వవిద్యాలయాల్లో ఉపకార వేతనాలు కుదించడం, ఫీజులు పెంచడం, 'నిర్భయ' నిధులు నిరాకరించడం వంటి చర్యలతో మహిళల విద్యను నిరాకరిస్తోంది. తాలిబన్ల చర్యలను ఖండించడం వెనుక ఇస్లామోఫోబియోను పెంచి ఓటు బ్యాంకుగా మార్చుకునే తపన తప్ప మహిళల విద్య పట్ల కానీ, రక్షణ పట్ల కానీ మోడీ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదు.

ఆకాశంలో సగభాగమైన మహిళల హక్కులకు ఎక్కడ ఏ రూపంలో భంగం కలిగినా అంతర్జాతీయ సమాజం ఒక్కటై కదలాలి. సామ్రాజ్యవాదం, మతోన్మాదం, నయా ఉదారవాదం మహిళలపై సాగిస్తున్న ఈ ముప్పేట దాడులను తిప్పికొట్టాలి. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కోసం గొంతెత్తుతున్న నేటి ఆఫ్ఘన్ మహిళలకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి. సామ్రాజ్యవాద, మతతత్వ శక్తులను ఒంటరిపాటు చేసినప్పుడే మహిళల హక్కులకు, మానవ హక్కులకూ రక్ష .

మంచి మాట



కొద్దిపాటి కార్పొరేషన్లు, కొన్ని శక్తివంతమైన దేశాలూ భూమి మీది వనరులన్నిటినీ చేజిక్కించుకుని...ప్రతిదాన్ని అమ్మకం-కొనుగోలు వస్తువులుగా మార్చేసి...మొత్తం భూగోళాన్ని ఒక సూపర్ మార్కెట్‌గా తయారుచేశాయి.

- వందనా శివ,
ప్రకృతి పరిరక్షణ కార్యకర్త.

పెరుగుతున్న అప్పులు - దిగజారుతున్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

విశ్లేషణ



ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకి దిగజారుతున్నది. ఉద్యోగులకు, పెన్షన్‌దారులకు సకాలంలో జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితిలోకి నెట్టబడుతున్నది. అభివృద్ధి కార్యక్రమాలు, కొత్త ప్రాజెక్టులు చేపట్టటం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమయ్యాయి. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక వాయిదా వేసుకొస్తున్నది. రెండోవైపు ఈ సమస్యను అధిగమించటానికి అప్పుల ద్వారా, ప్రజలపై పన్ను వడ్డింపుల ద్వారా ఆదాయం పెంచుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక మార్గాలను వెతుకుతున్నది. ఇప్పటికే సేకరించిన అప్పులు పెరిగిపోయాయని, రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మార్చేసిందనే విమర్శలు తీవ్రస్థాయిలో ఉన్నాయి.

నాలుగు రోజుల క్రితం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి తెలిపిన వివరాల ప్రకారం 2022 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్‌కు 3.98 లక్షల కోట్ల అప్పు ఉంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి)లో ఈ అప్పు 37.8 శాతంగా ఉందని కూడా తెలిపింది. ఇదిగాక వివిధ రాష్ట్ర కార్పొరేషన్‌ల ద్వారా బడ్జెట్‌తో సంబంధం లేని అప్పు (ఆఫ్ బడ్జెట్ అప్పు) లక్షా 71 వేల కోట్లతో పాటు నాన్ గ్యారంటీ అప్పు మరో 87 వేల కోట్లు ఉందని అంచనా.

ఈ ఏడాది తొలి తొమ్మిది నెలల కాలానికే కేంద్రం ఇచ్చిన రుణ పరిమితి దాటి పోయింది. విద్యుత్ సంస్కరణల అమలు రూపేణా ఇచ్చిన అదనపు రుణాలు కూడా ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంది. ఇక అప్పు తీసుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ఓవర్ డ్రాఫ్టులు, స్పెషల్ డ్రాయల్ లిమిట్ మీద ఆధారపడుతున్నది. ఇవి తాత్కాలిక సర్దుబాటు నిధులు మాత్రమే. ఇవి వెనువెంటనే తిరిగి చెల్లించాల్సినవి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా తప్పనిసరిగా ఉద్యోగుల జీతభత్యాలు, విశ్రాంతి ఉద్యోగుల పెన్షన్‌లు, వడ్డీలు, కొన్ని పథకాలకు చెల్లించాల్సిన వాటిని సకాలంలో చెల్లించలేకపోతున్నది.



డా॥ బి.గంగారావు

గత కొంతకాలంగా కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, కోవిడ్ -19 సృష్టించిన ఆర్థిక స్తంభన పరిమితమైన రాష్ట్రాల ఆదాయాలను దెబ్బతీశాయి. కేంద్ర బిజెపి సర్కారు అనుసరిస్తున్న పన్ను ఆదాయాల అసమాన పంపిణీ, పన్నుల ద్వారా సమకూరే ఆదాయంలో 61 శాతం కేంద్రమే ఉంచుకోవడం, సెస్, సర్ ఛార్జీ, ఇతర ఆదాయాలలో రాష్ట్రాలకు వాటా ఇవ్వకపోవడం, కార్పొరేట్ పన్ను భారీగా తగ్గించడం, సంపద పన్ను ఎత్తివేయడం, కస్టమ్స్ సుంకాల తగ్గింపు తదితర విధానాల వల్ల రాష్ట్రాలు భారీగా ఆదాయం కోల్పోతున్నాయి.

రాష్ట్రాల అప్పుల సేకరణపై ఆంక్షలు పెట్టటం, రుణ సామర్థ్య పరిమితిలో కోతలు పెట్టటంతో...రాష్ట్రాలు తమ పరిధిలో రుణాలు సమకూర్చుకునేందుకు కూడా పరిమితులు ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ 8 ఏళ్ల కాలంలో దేశ అప్పు రెట్టింపై నేడు 138 లక్షల కోట్లకు ఎగబాకి దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో 84 శాతానికి చేరింది. రాష్ట్రాల అప్పులపై మాత్రం గగ్గోలు పెడుతున్నది. రాష్ట్రాలు సేకరించుకునే ఆఫ్ బడ్జెట్ రుణాలను రాష్ట్రాల రుణ సామర్థ్య పరిమితిలో మాత్రమే కల్పిస్తామని బెదిరిస్తున్నది. రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కూడా కోత విధించాలని నానా యాగీ చేస్తున్నది.

> **రాష్ట్రాల అప్పుల సేకరణపై ఆంక్షలు పెట్టటం, రుణ సామర్థ్య పరిమితిలో కోతలు పెట్టటంతో... రాష్ట్రాలు తమ పరిధిలో రుణాలు సమకూర్చుకునేందుకు కూడా పరిమితులు ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మాత్రం విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నది. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ 8 ఏళ్ల కాలంలో దేశ అప్పు రెట్టింపై నేడు 138 లక్షల కోట్లకు ఎగబాకి దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో 84 శాతానికి చేరింది. రాష్ట్రాల అప్పులపై మాత్రం గగ్గోలు పెడుతున్నది. రాష్ట్రాలు సేకరించుకునే ఆఫ్ బడ్జెట్ రుణాలను రాష్ట్రాల రుణ సామర్థ్య పరిమితిలో మాత్రమే కల్పిస్తామని బెదిరిస్తున్నది. రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కూడా కోత విధించాలని నానా యాగీ చేస్తున్నది.**

కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటా పెంచి రాష్ట్రాలపై భారం కూడా మోపుతున్నది. కోవిడ్ వ్యయాన్ని కూడా రాష్ట్రాలపైకి నెట్టింది. ఇప్పుడు ఏకంగా రాష్ట్రాల జిఎస్‌టి ఆదాయంలో ఏర్పడుతున్న లోటును భర్తీ చేయటానికి ఇస్తున్న పరిహారాన్ని సైతం కేంద్రం నిలిపేసింది. వీటివల్ల అన్ని రాష్ట్రాలతో పాటు ఆంధ్ర రాష్ట్రం తీవ్ర ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నది.

కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపర్చే చర్యలకు, సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశంలో కేరళ, తమిళనాడు ఇతర అనేక రాష్ట్రాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. కాని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం అప్పుల కోసం కేంద్ర ప్రభుత్వానికి గులాంగిరి చేస్తున్నది. ఆంధ్ర రాష్ట్ర రెవిన్యూ లోటుకు చట్టప్రకారం చెల్లించాల్సిన నిధులకు కేంద్రం కోత పెడుతున్నా, జిఎస్‌టి ఆదాయ లోటు భర్తీ చేయకుండా రాష్ట్రానికి నష్టం చేస్తున్నా, ఈ ఏడాది రాష్ట్ర నికర రుణ సామర్థ్యంలో రూ.3600 కోట్లు కోత పెట్టినా ప్రభు భక్తితో వ్యవహరిస్తున్నది. కార్పొరేట్ పన్నులో కోత పెట్టినా కూడా స్పందించలేదు. చివరికి విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ నిధుల్లో సగానికి సగం కోత పెడుతున్నా, పునరావాస నష్ట పరిహారం ఇవ్వనంటున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి తగిన విధంగా వ్యవహరించటంలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఈ లొంగుబాటు విధానం వల్ల ఆంధ్ర రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతున్నది.

రాష్ట్రాల ఆర్థిక వనరులపై కేంద్ర బిజెపి సాగిస్తున్న ఈ దాడికి వ్యతిరేకంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పోరాడకుండా అప్పుల కోసం రాష్ట్ర హక్కులకు, ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రయోజనాలకు, సంక్షేమానికి హాని చేసే చర్యలకు పాల్పడుతున్నది. కోవిడ్‌ను అడ్డంపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల స్థూల ఉత్పత్తిలో అదనంగా 2 శాతం అప్పులు బహిరంగ మార్కెట్ నుండి తెచ్చుకోవటానికి రాష్ట్రాలకు అనుమతిస్తూ కొన్ని షరతులను విధించింది. ఒకే దేశం - ఒకే కార్డు, సులభతర వ్యాపారం, పట్టణ, విద్యుత్ రంగాల్లో పన్ను సంస్కరణలతో పాటు ప్రైవేటీకరణ విధానాలు అమలు చేయాలనే ఈ నాలుగు షరతులు అదనపు అప్పులు పొందే రాష్ట్రాలు అమలు చేయాలని నిబంధనలు విధించింది. ఈ ప్రమాదకర షరతులను అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శించటమే కాక ఈ అప్పులను తిరస్కరించాయి. కొన్ని బిజెపి రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఈ షరతులను నిరశించాయి. కాని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అప్పులకు తలూపి షరతులన్నింటిని ఆమోదించింది. కొన్ని షరతుల అమలుకు కూడా పూనుకుంది. కార్మిక చట్టాలను బలహీనపరుస్తూ యజమానులకు అనుకూలంగా తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌ల అమలుకు రాష్ట్రంలో అన్ని చర్యలు చేపట్టింది. పట్టణ రంగంలో ఆస్తి పన్ను మదింపులో అద్దె విలువ పద్ధతిని మార్చేసి ఆస్తి విలువ పద్ధతిని తీసుకొచ్చి భారీగా ఆస్తి పన్ను పెంచేసింది. నీటి కుళాయిలకు నీటి మీటర్ల బిగింపు, పౌర సేవలన్నింటికి యూజర్ చార్జీల వసూలు, ప్రైవేటీకరణ చర్యలు చేపట్టటం వంటి చర్యలకు కూడా పాల్పడుతున్నది.

విద్యుత్ రంగంలో ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుగార్చటం, వ్యవసాయ రంగ విద్యుత్ కనెక్షన్లకు మీటర్లు బిగించటం, దళిత, గిరిజనుల ఉచిత విద్యుత్ పథకానికి కోతలు పెట్టటం, సామాన్యుల విద్యుత్ వినియోగానికి ఇస్తున్న క్రాస్ సబ్సిడీకి నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టటం, విద్యుత్ పంపిణీని ప్రైవేటీకరించటం వంటి చర్యలు చేపట్టటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది.

ఆదాయాన్ని పెంచుకోవటంలో భాగంగా విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ప్రజల నుండి వసూలు చేయడం, విద్యుత్ చార్జీలు పెంచటం చేస్తున్నది. కృష్ణపట్నం థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూడా అదానీ పరం చేశారు. గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను కూడా రూ.645 కోట్లకు అదానీకి అమ్మేసింది.

మద్యం అమ్మకాలు పెంచటం ద్వారా భారీగా ఆదాయం పొందే చర్యలకు పాడిగట్టింది. గత ఎన్నికల్లో ఇచ్చిన దశల వారీ సంపూర్ణ మద్య నిషేధ వాగ్దానానికి తిలోదకాలిచ్చి దశలవారీ విస్తరణ కార్యక్రమం చేపట్టింది. బార్లు పెంచేసింది. గడిచిన 9 నెలల కాలంలోనే రూ.20 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్జించింది. ఈ ఏడాది చివరికి రూ.28,440 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ఇది చాలదన్నట్లు ఈ పెరుగుతున్న ఆదాయాన్ని చూపి ప్రభుత్వం ఈ శాఖ ద్వారా బ్యాంక్‌ల నుండి ఈ ఏడాది రూ.8300 కోట్ల అప్పు సేకరించింది.

విచ్చలవిడిగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఏర్పాటు చేశారు. వీటి ద్వారా పెద్దఎత్తున ప్రభుత్వ భూములను, ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతుల భూములను సేకరించి రియల్ ఎస్టేట్ సంస్థలకు అమ్మడం, తద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ఖజానాకు తరలించుకు పోవటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. అంతేగాక వీటి ద్వారా భూ మార్పిడి చార్జీలు, ఇంపాక్ట్ ఫీజుల ఆదాయాలు పెంచుకోవటానికి చూస్తున్నది. ఈ చర్యల ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ భూమి పెద్ద ఎత్తున రియల్ ఎస్టేట్‌కు మారిపోయే ప్రమాదం ఏర్పడింది. స్టాంప్ డ్యూటీ ద్వారా ఆదాయాన్ని పెంచుకోవటానికి ప్రతి ఏడాది భూముల మార్కెట్ విలువను పెంచేస్తున్నది. ప్రభుత్వ స్థలాలను, ప్రభుత్వ కార్యాలయాలను బ్యాంకుల్లో తనఖా పెట్టి అప్పులు కూడా సేకరిస్తున్నది.

రాష్ట్రంలో చేపడుతున్న రామయపట్నం, భావనపాడు, బందర్ పోర్టుల నిర్మాణ బాధ్యతల నుండి ప్రభుత్వం వైదొలిగి (అప్పుల కోసం) ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేయటానికి సిద్ధమైంది. అందుకే ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ (ఐఐఎఫ్‌సిఎల్) సంస్థ నుండి అప్పులు తీసుకోవటానికి కూడా ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ ప్రైవేట్ రంగంలో లేదా ప్రభుత్వ - ప్రైవేట్ రంగ భాగస్వామ్యం (పిపిపి) కింద చేపట్టే ప్రాజెక్టులకు అప్పులు ఇస్తుంది. అందువల్ల ఈ మూడు పోర్టులు త్వరలో ప్రైవేట్ సంస్థల పరం కానున్నాయి. ఈ చర్యల ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ఖజానాకు జమేసుకుంటుంది.

ఇప్పుడు అప్పుల ద్వారా ఆదాయం సేకరించుకునే మార్గాలు కూడా తగ్గిపోవడంతో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవడంపై కేంద్రీకరించింది. నవరత్నాల పథకాల లబ్ధిదారులను తగ్గించటానికి వివిధ రకాల షరతులు పెడుతున్నది. ప్రజా పంపిణీ వ్యవస్థను బియ్యానికే పరిమితం చేసింది. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల తొలగింపుకు పూనుకుంటున్నది. ఉద్యోగులకు నూతన పెన్షన్ స్కీము రద్దు చేసి పాత పెన్షన్ స్కీమును పునరుద్ధరించకపోవడం, ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్ళకు పొడిగించటం, కొత్త ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకపోవటం వంటి చర్యలన్నీ ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవటంలో భాగంగా ప్రభుత్వం చేస్తున్నది.

పట్టణ, గ్రామ స్థానిక సంస్థల యొక్క స్థానిక పన్నుల ద్వారా సమకూరే ఆదాయాలను కూడా సిఎఫ్‌ఎంఎస్ సంస్థ ఖాతాకి తరలించి రాష్ట్ర అవసరాలకు వినియోగించుకుంటూ స్థానిక సంస్థల అభివృద్ధిని దెబ్బతీస్తున్నది. 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే స్థానిక సంస్థలకు బదిలీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకోవటం లేదా విద్యుత్ బిల్లుల పేర జమేసుకోవటం వంటి చర్యలకు పాల్పడుతున్నది. స్థానిక సంస్థలకు రాష్ట్ర బడ్జెట్ నుండి నిధులు ఇవ్వాల్సి వస్తుందని రాష్ట్ర ఆర్థిక సంఘం ఊసెత్తటం లేదు.

బడ్జెట్‌లో వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన పెట్టుబడి వ్యయం నిధుల్లో కూడా భారీ కోత పెడుతున్నది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.47996 కోట్లు పెట్టుబడి వ్యయంగా చూపించారు. ఇందులో కనీసం 30 శాతం కూడా నేటికీ ఖర్చు చేయలేదు. దీంతో అభివృద్ధి చర్యలన్నీ కాగితాలకే పరిమితం అయ్యాయి.

మొత్తంగా చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మోడీ సర్కారు చేపడుతున్న చర్యలు రాష్ట్ర ఆదాయ వనరులను దెబ్బతీస్తున్నాయి. వీటికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిన జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం...మోడీ ప్రభుత్వానికి సలాం చేస్తున్నది. అడుగడుగునా లొంగుబాటు ప్రదర్శిస్తున్నది. అప్పుల కోసం రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల సంక్షేమాన్ని ఫణంగా పెడుతున్నది. అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ చర్యలు చేపడుతున్నది. ప్రజలపై భారాలు మోపుతున్నది. అవకాశవాద రాజకీయాలతో అరాచకపు ఆర్థిక చర్యలకు పాల్పడుతున్నది.

(వ్యాసకర్త సెల్ : 9490098792)

సమస్య

యాసిడ్ దాడులు మానవత్వానికే మచ్చ

దేశంలో మహిళలపై యాసిడ్ దాడులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ యాసిడ్ దాడులను పురుషాహంకారానికి ప్రతీకగా చూడాల్సి వుంది. ఇటీవల ఉత్తర ప్రదేశ్ లో ద్వారకకు చెందిన పదిహేడేళ్ల అమ్మాయిపై జరిగిన యాసిడ్ దాడి ఇందుకు తాజా ఉదాహరణ. 2005లో యాసిడ్ దాడికి గురై, ప్రాణాలతో బయటపడిన లక్ష్మీ అగర్వాల్ తనలాంటి బాధితుల హక్కుల కోసం పోరాడుతున్నది. ముఖ్యంగా ప్రేమ వ్యవహారాలు బెడిసి కొట్టిన సందర్భాలలో అసహనంతో అనాలోచితంగా ఇటువంటి దాడులకు ఒడిగట్టడం మానవత్వానికే మాయని మచ్చ.

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజా నివేదిక ప్రకారం 2016 నుంచి 2021 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 1686 యాసిడ్ దాడులు జరిగాయి. అంటే ప్రతీ సంవత్సరం సగటున 250 నుంచి 300 యాసిడ్ దాడులు జరుగుతున్నట్లు సమాచారం. 2021లో ప్రతి నెలా సగటున 14 యాసిడ్ దాడులు జరిగినట్లు నివేదిక పేర్కొంది. ఈ యాసిడ్ దాడుల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ మొదటి స్థానంలో ఉన్నాయి. తన ప్రేమను అంగీకరించలేదనే ఒకే ఒక కారణంగా....సదరు అమ్మాయి జీవితాన్ని, అందాన్ని చెరిపివేయాలనే దుర్మార్గపు ఆలోచనతో ఈ యాసిడ్ దాడులకు పాల్పడుతున్నారు. 2013 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అన్ని దుకాణాల్లో యాసిడ్ అమ్మరాదు. కానీ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా కూడా యాసిడ్ అందుబాటులోకి వచ్చిందని తెలుస్తోంది. నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా వుంది.

గత కొన్ని సంవత్సరాలుగా యువత మీద పలు వెబ్‌సైట్ల ప్రభావం వుంటోంది. అవి వారిలో చెడు అలవాట్లు, సెక్స్, హింసా ప్రవృత్తిని ప్రేరేపించేలా వున్నాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు ఎక్కువ సమయం కేటాయించాలి. వారు చూసే వెబ్‌సైట్లు, చేసే స్నేహాలపై దృష్టి సారించాలి. తల్లిదండ్రులు, టీచర్లు స్నేహితుల వలే మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలి.



ఈరోజు కుటుంబ సభ్యులు ఒకే చోట ఉన్న సందర్భంలో కూడా ఎవరి సెల్ గోల వారిదే. దగ్గరగా ఉన్నా దూరం పెంచుకుంటున్న పరిస్థితి. ఇవన్నీ చూస్తుంటే కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. మానసిక రుగ్మతలు పెరిగి, నానా సమస్యలు తలెత్తుతున్నాయనిపిస్తోంది. ముఖ్యంగా దేశంలో దాదాపు 40 శాతం మంది ప్రజానీకం పలురకాల మానసిక సమస్యలతో బాధపడుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. అసహనం, హింసా ప్రవృత్తి రోజురోజుకు పెరిగిపోతున్నది. రకరకాల మత్తులకు యువత బానిస అవుతున్నది.

వ్యక్తుల సమూహమే సమాజం. అటువంటి వ్యక్తుల జీవన విధానం ఒక క్రమ పద్ధతిలో కొనసాగితేనే సమాజంలో చోటుచేసుకుంటున్న వికృత చేష్టలకు చెక్ పెట్టగలం. మన ప్రవర్తన మీదనే సమాజం ఆధారపడి ఉంటుందని గ్రహించాలి. అప్పుడు మాత్రమే యాసిడ్ దాడులు, అఘాయిత్యాలు, హత్యలు, ఆత్మహత్యలు వంటి వాటిని అరికట్టగలం.

అదే సమయంలో పాలకుల పని తీరు, స్వభావం కూడా ప్రజలపై ప్రభావం చూపుతుందనే విషయం నేటి పాలకులు, ప్రభుత్వాలు గ్రహించాలి. చట్టాలు చేయడమే కాకుండా, వాటిని సక్రమంగా అమలు చేయడంలోనూ చిత్తశుద్ధి చూపాలి. రేప్ చేసిన వారు, యాసిడ్ దాడుల చేసిన వారు, హత్యలు మానభంగాలు చేసిన వారు, అవినీతిపరులు బయట ప్రపంచంలో స్వేచ్ఛగా సంచరిస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. నేరారోపణ ఎదుర్కొంటున్న వారు జైలు నుండి బయటకు వస్తుంటే, భారీ ఎత్తున పూలదండలు, బాణాసంచా కాల్చి ఆహ్వానం పలుకుతుండటం దేనికి సంకేతం?

పౌర సమాజమూ ఆలోచన చేయాలి. మానవ విలువలకు, నైతిక ప్రవర్తనకు మారు పేరుగా నిలవాల్సిన మన దేశం...అసభ్యకర ప్రవర్తనకు, హింసకు, అవినీతికి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుండడం బాధాకరం. మన చుట్టూ అవిద్య, నిరుద్యోగం, పేదరికం తాండవిస్తుంటే, నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతుంటే, అత్యాచారాలు, యాసిడ్ దాడులు పెరిగిపోతుంటే బతుక్కు భద్రత ఎలా వుంటుంది? ఇటువంటి తరుణంలో ....తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మీడియా, ప్రభుత్వాలు, పాలకులు తమ సమయాన్ని, బాధ్యతలను అంకిత భావంతో చిత్తశుద్ధితో నిర్వర్తించడం ద్వారానే ఉత్తమ పౌర సమాజాన్ని నిర్మించగలం.

- ఐ.పి.రావు,
సెల్ : 6305682733

నివాళి

మహిళలకు స్ఫూర్తి ఉద్దరాజు మాణిక్యాంబ

తెలుగునాట స్వాతంత్ర్య, కమ్యూనిస్టు ఉద్యమాలు మట్టిలో మాణిక్యాల వంటి ఎందరినో వెలుగులోకి తెచ్చాయి. అలాంటి మణిపూసలలో ఒకరు ఉద్దరాజు మాణిక్యాంబ.

తూర్పు గోదావరి జిల్లా అమలాపురం సమీపంలోని వన్నెచింతలపూడి గ్రామంలో నడింపల్లి బాపిరాజు, వెంకమ్మల చిన్న కుమార్తె మాణిక్యాంబ. సహజంగానే ఇంట్లో చిన్నవారిని గారాబంగా పెంచుతారు. ఆమెకు పదహారవ ఏట, పద్దెనిమిదేళ్ల ఉద్దరాజు రామం (తరువాత రాష్ట్ర కమ్యూనిస్టు నేతలలో ఒకరుగా మారారు. ఎంపీగా, ఆలిండియా కిసాన్ సభ అధ్యక్షుడిగా పనిచేశారు)తో వివాహం జరిగింది.



మహాత్మాగాంధీ పశ్చిమ గోదావరి జిల్లాలో సత్యాగ్రహ శిబిరాలను సందర్శించినపుడు ఆమె తన వంటి మీద ఉన్న 70 కాసుల బంగారు నగలను విరాళంగా ఇచ్చారు. మరోసారి పసిడిని ధరించను అని వాగ్దానం చేస్తేనే వాటిని స్వీకరిస్తానని గాంధీ అనటంతో ఆ మేరకు ప్రతినబూనిన ఆమె జీవితాంతం దానికి కట్టుబడి ఉన్నారు. తరువాత తల్లి ఇచ్చిన మరో 70 కాసుల బంగారు నగలను కమ్యూనిస్టు పార్టీకి ఇచ్చివేశారు. అలాంటి ధనిక కుటుంబం నేపథ్యం ఉన్న ఆమె రామంగారితో కలసి విజయవాడలో ఒక చిన్న పూరింటిలో ఉన్నారంటే నమ్మకపోవచ్చుగానీ, అది నిజం. అంతేనా! కమ్యూనిస్టులపై నిర్బంధకాండకు ప్రభుత్వం పూనుకోవటంతో రామం అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. అప్పుడు పిల్లలతో కుటుంబ పోషణకు ఆమె కూడా వేరే ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. పిల్లి సంసారం అని కొందరు అన్నపుడు కూడా వాటినామె పట్టించుకోలేదు. పోలీసులు ఆమె ఎక్కడ ఉన్నదీ తెలుసుకొని రామం జాడచెప్పాలని వేధించినా, మీ భర్తను కాల్చివేశామని చెప్పి భయపెట్టేందుకు చూసినా జంకని ధైర్యవంతురాలు ఆమె.

రామం దంపతులు స్వాతంత్ర్య ఉద్యమంలోకి దూకినపుడు లాఠీ దెబ్బలు, నిర్బంధాలు, జైళ్ల తప్ప కనుచూపు మేరలో స్వతంత్ర భారతం వారికి కనిపించలేదు. తరువాత తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటానికి మద్దతు ఇచ్చిన ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో కమ్యూనిస్టులను వేధించారు, నిర్బంధ శిబిరాల్లోకి నెట్టారు. స్త్రీ పురుషులను బట్టలిప్పించి గాంధీ విగ్రహాల ముందు నిలబెట్టిన దుర్మార్గాలు ఒకవైపు. అజ్ఞాతవాసంలో ఉన్న వందలాది మందిని కాల్చిచంపిన స్థితి మరోవైపు. మాణిక్యాంబ వంటి వారు ఎందరో అలాంటి స్థితిలో భర్తలకు వెన్నుదన్నుగా నిలిచారు.

ఉన్నంతలోనే కమ్యూనిస్టు పార్టీ నేతలు, కార్యకర్తలు ఎవరినైనా ఒకే విధంగా చూసిన చైతన్యవంతురాలు మాణిక్యాంబ. చిన్నతనంలో నోములు, పూజలు, పునస్కారాలు, మంగళహారతుల గతం ఉన్న ఆమె...వివాహం తర్వాతి నుంచి మరణించే వరకు వాటి ఊసే లేకుండా గడిపారు. 2008 డిసెంబరు 24న 94వ ఏట ఆమె మరణించారు. వజ్రాలు, మాణిక్యాలకు మరణం ఉండదు. మాణిక్యాంబ జీవితమూ అంతే!

- గాదిరాజు శారద

ఐసిఐసిఐ మాజీ సిఇఒ చందా కొచ్చర్ దంపతుల అరెస్టు



న్యూఢిల్లీ : అక్రమాలు, అవినీతి కేసులో ఐసిఐసిఐ బ్యాంక్ మాజీ సిఇఒ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌ను సిబిఐ శుక్రవారం అరెస్టు చేసింది. చందా కొచ్చర్ పదవిలో ఉన్న కాలంలో నిబంధనలను అతిక్రమిస్తూ వీడియోకాన్ గ్రూపునకు రూ.3,250 కోట్లు రుణం మంజూరు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ ఆరోపణల కారణంగానే 59 ఏళ్ల కొచ్చర్ 2018 అక్టోబర్‌లో ఐసిఐసిఐ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ బాధ్యతల నుంచి వైదొలిగారు. 2012లో వీడియోకాన్ సంస్థకు ఇచ్చిన రుణం తరువాత కాలంలో ఐసిఐసిఐ బ్యాంక్ యొక్క నిరర్థక ఆస్థి (ఎన్‌పిఎ)గా మారిందని, ఇందులో చంద కొచ్చర్ కుట్ర, మోసం ఉన్నాయని సిబిఐ ఆరోపిస్తోంది. వీడియోకాన్ గ్రూపునకు రుణం మంజూరైన కొన్ని నెలల తరువాత కొచర్ స్థాపించిన న్యూపవర్ రెన్యువబుల్స్‌లో వీడియోకాన్ మాజీ చైర్మన్ వేణుగోపాల్ ధూత్ కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టారని సిబిఐ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది. ఈ లావాదేవీల వల్ల కొచ్చర్, దీపక్ కొచ్చర్ కుటుంబ సభ్యులు లబ్ధి పొందారని ఆరోపించింది.

ముక్కులో చుక్కల మందు

- భారత్ బయోటెక్ వ్యాక్సిన్‌కు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ : కరోనా కేసులు పెరుగుతుండటంతో భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన రెండు చుక్కల నాసికా వ్యాక్సిన్ ఇన్‌కోవాక్ (బిబివి154) బూస్టర్ డోస్‌గా వినియోగించేందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రస్తుతానికి ప్రైవేటు ఆసుపత్రుల్లో నామమాత్రపు ధరకే వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. దీనిని త్వరలో జాతీయ కోవిడ్ వ్యాక్సినేషన్ కో-విన్‌లో ప్రవేశపెట్టే అవకాశముందని తెలిపాయి. ఇప్పటికే కొవిషీల్డ్, కోవాగ్జిన్ టీకాలు తీసుకున్న వారు ఈ చుక్కల మందును హెటిరోలాగస్ బూస్టర్ డోస్‌గా తీసుకునేందుకు భారత డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ నవంబర్‌లోనే అనుమతించారు. మనదేశంలో 18 ఏళ్ల పైబడినవారంతా ఈ టీకాను వినియోగించుకోవచ్చునని సంబంధిత వర్గాలు తెలిపాయి.

అస్సాంలో 'ఇడబ్ల్యుఎస్' నిలిపివేత

- విరుచుకుపడ్డ ప్రతిపక్షాలు

గౌహతి : ఉద్యోగ నియామకాల్లో ఇడబ్ల్యుఎస్ కోటా రిజర్వేషన్ అమలును అస్సాంలోని బిజెపి ప్రభుత్వం నిలిపివేసింది. ఉద్యోగ నియామకాల్లో ఇడబ్ల్యూఎస్ కోటా రిజర్వేషన్ అమలుకు తాత్కాలికంగా విరామం ప్రకటిస్తూ ఈ నెల 21న అస్సాం సిబ్బంది మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఇడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయడం లేదని తెలిపింది. ఇడబ్ల్యూఎస్ కోటాను సమర్థిస్తూ సుప్రీంకోర్టు మెజార్టీ తీర్పు ఇచ్చిన నెల రోజుల తరువాత అస్సాం ప్రభుత్వం ఈ నోటిఫికేషన్ విడుదల చేయడంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం కారణంగా ఖర్చు తగ్గింపు చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకుందని శాసనసభలో ప్రతిపక్ష నేత దేవవ్రత సైకియా విమర్శించారు. అస్సాం యువతకు లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో బిజెపి ఇచ్చిన హామీకి ప్రభుత్వ నిర్ణయం విరుద్ధమని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఎమ్మెల్యే అమీనుల్ ఇస్లాం విమర్శించారు.

ఛార్లెస్ శోభరాజ్ విడుదల



ఖాట్మాండు : సీరియల్ కిల్లర్ ఛార్లెస్ శోభరాజ్ శుక్రవారం నేపాల్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ దేశ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సుమారు 20 ఏళ్ల శిక్ష అనంతరం శోభరాజ్‌ను అధికారులు విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం ఛార్లెస్ ఫ్రాన్స్‌కు బయలుదేరినట్లు అతని లాయర్ గోపాల్ శివకోటి చింతన్ విలేకరులకు తెలిపారు. 'వీలైనంత త్వరగా శోభరాజ్‌ను వెనక్కి పంపాలని ప్రభుత్వం భావిస్తుంది. శోభరాజ్ కూడా అదే కోరుకుంటున్నారు. కాబట్టి నేను అతనికి సాయంత్రం 6 గంటలకు వెళ్లే ఖతార్ ఎయిర్‌వేస్ విమానం టిక్కెట్టు సమకూర్చాను. ప్రయాణానికి అవసరమైన పత్రాలను ఫ్రెంచ్ రాయబార కార్యాలయం ఏర్పాటు చేసింది' అని లాయర్ తెలిపారు. 1970 దశకంలో నేపాల్‌లో ఇద్దరు అమెరికా మహిళలను హత్య చేసిన కేసులో 2003 నుంచి నేపాల్‌లోని ఖాట్మాండు జైలులో శోభరాజ్ శిక్ష అనుభవిస్తున్నాడు. 78 ఏళ్ల శోభరాజ్‌ను జైలు నుంచి విడుదల చేయాలని బుధవారం సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అతనికి పాస్‌పోర్ట్ జారీ చేసిన దేశానికి 15 రోజుల్లో శోభరాజ్‌ను పంపివేయాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది.

లక్ష్యం చేరకపోయినా విజయవంతమా!

- డిఆర్‌డిఒపై కాగ్ ఆగ్రహం
- పార్లమెంట్‌కు నివేదిక



న్యూఢిల్లీ : రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) మందలించింది. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ లక్ష్యాలు, ప్రామాణికాలను సాధించలేకపోయినప్పటికీ ఆ ప్రాజెక్టులు విజయవంతమయ్యాయని ప్రకటిస్తూ, వాటిని ఒక పద్ధతి లేకుండా క్లోజ్ చేస్తున్నారని డిఆర్‌డిఒను కాగ్ విమర్శించింది. పైగా ప్రాజెక్టుల పూర్తికి పట్టే సమయం, అయ్యే ఖర్చు రెండూ విపరీతంగా పెరిగిపోతున్నాయని విమర్శించింది. అదీకాక, గతంలో క్లోజ్ చేసిన ప్రాజెక్టులకు సంబంధించి సాధించని లక్ష్యాల పూర్తికి గానూ కొత్త ప్రాజెక్టులను చేపట్టి విజయవంతమయ్యాయని ప్రకటించడాన్ని విమర్శించింది. ఈ మేరకు కాగ్ నివేదికను బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.

మొత్తంగా 178 ప్రాజెక్టులకు గానూ 119 ప్రాజెక్టుల్లో ముందుగా పేర్కొన్న కాలపరిమితికి కట్టుబడలేదు. 49 కేసుల్లో అదనంగా తీసుకున్న సమయం ముందుగా పేర్కొన్న కాలపరిమితి కన్నా వంద శాతమూ అధికంగా వుంది. మొత్తమ్మీద, జాప్యాలనేవి 16శాతం నుంచి 500శాతం వరకు వున్నాయి. ప్రాజెక్టుల పూర్తికి పట్టే సమయాన్ని పలుమార్లు పొడిగించారు. సాంకేతికతలు అందుబాటులో వున్నా లేదా సులభంగా అందుకోగలిగే రీతిలో వున్న ఎంఎం (మిషన్ మోడ్) ప్రాజెక్టులు పూర్తి కావడంలో కాలాతీతం జరిగిందని కాగ్ తన ఆడిట్ నివేదికలో పేర్కొంది. "డిఆర్‌డిఒలో మిషన్ మోడ్ ప్రాజెక్టుల నిర్వహణ, ఫలితాలు" అనే అంశంపై తన ఆడిట్ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. 2010 జనవరి నుంచి 2019 డిసెంబరు వరకు మొత్తంగా 86 ప్రాజెక్టులు విజయవంతమయ్యాయని ప్రకటించగా, వాటిలో 20 ప్రాజెక్టుల వ్యయం రూ.1074.67 కోట్లుగా వుందని నివేదిక పేర్కొంది. పైగా ఆ ప్రాజెక్టులకు సంబంధించి ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ ప్రామాణికాలు లేదా లక్ష్యాలు సాధించలేదని నివేదిక విమర్శించింది.

నిర్దిష్ట కాల పరిమితిలో నిర్దిష్ట యూజర్ల అవసరాలను తీర్చడమే ప్రాతిపదికగా చేపట్టే మిషన్ మోడ్ (ఎంఎం) ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యత గల ప్రాజెక్టులుగా డిఆర్‌డిఒ చేపడుతుంది. ఇప్పటికే అందుబాటులో వున్న, నిర్ధారించబడిన, స్వల్ప నోటీసుతో దేశ విదేశాల నుంచి సులభంగా అందుకోగల సాంకేతికతల ఆధారంగా ఈ ప్రాజెక్టులు వుంటాయి. అన్ని సాంకేతికతలు అందుబాటులో వున్నా ఈ ఎంఎం ప్రాజెక్టుల పూర్తికి అసాధారణమైన రీతిలో జాప్యం జరగడాన్ని నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. అడ్మినిస్ట్రేటివ్ క్లోజర్ రిపోర్ట్స్ (ఎసిఆర్) అందజేయడంలో కూడా అసాధారణమైన జాప్యాలు జరిగాయని, 15 నెలల నుంచి 112 నెలల వరకు ఈ ఆలస్యం జరిగినట్లు ఆ నివేదిక పేర్కొంది.

రోజుకు 115మంది డైలీవేజ్ కార్మికుల ఆత్మహత్య!

- 63మంది గృహిణుల బలవన్మరణం
- పార్లమెంట్‌లో గతేడాది సగటు గణాంకాలు వెల్లడించిన కేంద్రం



న్యూఢిల్లీ : గతేడాది సగటున ప్రతి రోజూ 115 మంది దినసరి వేతన కార్మికులు, 63మంది గృహిణులు ఆత్మహత్య చేసుకున్నారని కేంద్రం తెలియజేసింది. పార్లమెంట్‌లో ఇటీవల ప్రశ్నోత్తరాల సమయంలో స్వయంగా కేంద్ర ప్రభుత్వమే ఈ విషయాలు వెల్లడించడం గమనార్హం. లోక్‌సభలో కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు మహ్మద్ జావేద్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్, జాతీయ నేరాల నమోదు బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటాను ఉటంకించారు. 2021లో మొత్తంగా 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారని ఎన్‌సిఆర్‌బి డేటా తెలిపింది. వీరిలో 42,004 మంది దినసరి వేతన కార్మికులని, 23,179మంది గృహిణులని పేర్కొంది. మొత్తంగా 20,231మంది స్వయం ఉపాధి వ్యక్తులు, 15,870మంది వేతన ఉద్యోగులు, 13,714మంది నిరుద్యోగులు, 13,089మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దేశంలో దినసరి వేతన కార్మికుల్లో పెరుగుతున్న ఆత్మహత్యలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేంటో చెప్పాల్సిందిగా కాంగ్రెస్ ఎంపి జావేద్ కోరారు. దానికి మంత్రి రాయ్ స్పందిస్తూ, వ్యవసాయ రంగంలోని కార్మికులతో సహా అసంఘటిత రంగంలోని కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించేందుకు గానూ అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం, 2008ని ప్రభుత్వం రూపొందించిందని చెప్పారు.

రైల్వేలో 3,11,521 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వేలో ఈ నెల 1 నాటికి వివిధ విభాగాల్లో 3,11,521 గెజిటెడ్, నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 18 రైల్వే జోన్స్‌లో 3,12,941 నాన్ గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గ్రూప్ సి పోస్టులు 2,90,367, గ్రూప్ ఎ, గ్రూప్ బి పోస్టులు 2,473 ఖాళీగా ఉన్నాయి. గత మూడేళ్లలో గ్రూప్ డి పోస్టులు భర్తీ చేయలేదు. గ్రూప్ సి పోస్టులు 2020లో 2,78,206 ఖాళీలు ఉంటే, 2021 నాటికి ఖాళీలు 2,79,435 పెరిగాయి, 2022కి ఖాళీలు సంఖ్య 2,90,367 పెరిగాయి. గ్రూప్ ఎ, గ్రూప్ బి పోస్టులు కూడా 2020లో 2,326 పోస్టులు, 2022లో 2,473 పోస్టులు ఖాళీలు పెరిగాయి. కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖలో 2,529 ఖాళీలు ఉన్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. సిపిఎం ఎంపి వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

రామసేతుకు కచ్చితమైన రుజువు లేదు : జితేంద్ర సింగ్

రామసేతుకు కచ్చితమైన రుజువు లేదని కేంద్ర స్పేస్ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తెలిపారు. రాజ్యసభలో బిజెపి ఎంపి కార్తికేయ శర్మ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

"అక్కడ ఉన్న కచ్చితమైన నిర్మాణాన్ని గుర్తించడం చాలా కష్టం, అయితే ఆ నిర్మాణాలు ఉనికిలో ఉన్నాయని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఒక రకమైన సూచన ఉంది" అని మంత్రి చెప్పారు.

పురుగుమందుల వల్ల చనిపోయిన రైతుల వివరాలు లేవు

గత ఐదేళ్లలో పురుగు మందులు, క్రిమి సంహారక మందులు విచక్షణారహితంగా వినియోగించడం వల్ల చనిపోయిన రైతుల డేటా అందుబాటులో లేదని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

జర్మనీలో క్రిస్మస్ సమయంలోనూ ఉద్యోగాల కోత

- ఉధృతమవుతున్న ఆందోళనలు



ఆందోళన చేస్తున్న ఫోర్డు కార్మికులు (ఫైల్)

బెర్లిన్ : సాధారణంగా క్రిస్మస్ వంటి పండగ సమయాల్లో ఉద్యోగులు ఆనందంగా ఉంటారు. సంస్థల యాజమాన్యాల నుంచి బోనస్‌లు, బహుమతులు, పదోన్నతులు గురించి ఉద్యోగులు ఎదురుచూస్తుంటారు. ఈసారి క్రిస్మస్ సమయంలో జర్మనీలో ఉద్యోగులు ఉద్యోగాల కోత, ఫ్యాక్టరీల మూసివేత వంటి భయానక అనుభవాలు ఎదుర్కొంటున్నారు. ఆటో, స్టీల్, మెటల్ ఉత్పత్తి సంస్థలు, ఉత్పత్తి, సేవలు, లాజిస్టిక్స్, విమానాయాన రంగం, రిటైల్, రియల్ ఎస్టేట్ వంటి వివిధ రంగాలకు చెందిన కొన్ని కంపెనీలు ఇప్పటికే వందల సంఖ్యలో ఉద్యోగులను తొలగించగా, మరికొన్ని తొలగించేందుకు సిద్ధమవుతున్నాయి. ప్రముఖ కంపెనీలైన వోక్స్‌వ్యాగన్, ఓపెల్, స్టెల్లాంటిస్, డైమ్లర్ బెంజ్ అండ్ బిఎండబ్ల్యూ వంటి సంస్థలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ప్రముఖ ఉక్కు సంస్థ ఆర్సెల్ మిట్టల్, డ్రక్‌గస్ దోహ్నా, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ గ్రూప్ టు కనెక్టివిటీ కూడా ఉద్యోగులను ఇళ్లకు పంపుతున్నాయి. ఎక్కువ కంపెనీలు తాత్కాలిక ఉద్యోగులతో కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభం పేరు చెప్పి ఉద్యోగులను తొలగిస్తున్న సంస్థల యాజమాన్యాలు మాత్రం తమ జేబులను నింపుకొంటున్నాయి. సంస్థల వాటాదారులు, మేనేజర్లు మిలియన్ల కొద్దీ బోనస్‌లను తమ ఖాతాలో వేసుకుంటున్నారు.

జర్మనీ వ్యాప్తంగా పెరుగుతున్న ఆందోళనలు

యాజమాన్యాల దుర్మార్గ విధానాలను నిరసిస్తూ జర్మనీ వ్యాప్తంగా కార్మికులు నిరసనలు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అమెజాన్ సిబ్బంది నిరసన వివిధ ప్రాంతాల్లో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వేతనం, సెలవులు లేకపోవడానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించారు. ఐకియా సిబ్బంది ప్రస్తుత బిజీ షాపింగ్ సీజన్‌లోనూ ఒక రోజు సమ్మె నిర్వహించారు. వెస్టాస్ విండ్ టర్బైన్‌లకు చెందిన 200 మంది ఉద్యోగులు మెరుగైన వేతనం కోసం కంపెనీ ప్రధాన కార్యాలయం ముందు ప్రదర్శన చేశారు.


37 మందితో లూలా మంత్రివర్గం

బ్రసీలియా : బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికైన లూలా డా సిల్వా 37 మంత్రులతో కూడిన కేబినెట్‌ను అధికారికంగా ప్రకటించారు. ఆయన వచ్చే ఏడాది ప్రారంభం నుండి పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. బ్రెజిల్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన గెరాల్డో అల్‌కెమిన్ అభివృద్ధి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రిగా వ్యవహరించనున్నారు. అల్‌కెమిన్ నాలుగుసార్లు సావో పాలో గవర్నర్‌గా వ్యవహరించారు. మాజీ ఫెడరల్ డిప్యూటీ, పిండ్‌మోన్‌హంగాబా గవర్నర్‌గానూ విధులు నిర్వహించారు. ఫియోక్రజ్ అధ్యక్షుడు, రియో డి జనీరోలోని యూనివర్శిటీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ అయిన నిసియా ట్రిండాడే లియా ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. పర్యావరణ అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీని, పెడరల్ యూనివర్శిటీ ఆఫ్ సియారా నుండి అగ్రోనమీలో పట్టా పొందిన సెనెటర్, సియారా మాజీ గవర్నర్ కామ్లో శాంటానా విద్యాశాఖకు నాయకత్వం వహిస్తారు. జాతి సమానత్వ శాఖ, మానవహక్కుల శాఖ, కార్మికశాఖల బాధ్యతలను వరుసగా అనియెల్ ఫ్రాంకో, సిల్వియో అల్మెడా, లూయిజ్ మారిన్హో చేపట్టనున్నారు. సామాజిక అభివృద్ధి మంత్రిత్వ శాఖను నాలుగుసార్లు పియామ్ గవర్నర్‌గా, రెండుసార్లు సెనెటర్‌గా వ్యవహరించిన వెల్లంగ్టన్ డయాస్‌కు కేటాయించారు.

పారిస్‌లో కాల్పులు : ముగ్గురి మృతి

పారిస్ : ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో శుక్రవారం జాత్యహంకారంతో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జాత్యాహంకారంతో కుర్దిష్‌లే లక్ష్యంగా కాల్పులకు తెగబడ్డ 69 ఏళ్ల మాజీ ట్రైన్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సెంట్రల్ ప్యారిస్‌లోని కుర్దిష్ సాంస్కృతిక కేంద్రం, ఒక సెలూన్, కాఫీ షాపులపై దుండగుడు తుపాకీతో శుక్రవారం అనేక రౌండ్లు కాల్పులకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 8న కూడా పారిస్‌లోని బెర్సీ పార్క్ వద్ద ఉన్న శరణార్థుల శిబిరంలో ఇద్దరు వలసదారులపై కత్తితో దాడి చేయడమే కాకుండా, అనేక టెంట్లను ధ్వంసం చేశాడు.

జర్నలిస్టు సిద్దిఖ్ కప్పన్‌కు బెయిల్



న్యూఢిల్లీ : కేరళ పాత్రికేయుడు సిద్దిఖ్ కప్పన్‌కు అలహాబాద్ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయనపై నమోదైన కేసులో గత రెండేళ్లుగా జైలు జీవితం గడుపుతున్నారు. కప్పన్‌పై కేంద్ర దర్యాప్తు సంస్థలు తీవ్రవాద నిరోధక చట్టం, ఉపా..మొదలైన కేసులు నమోదు చేశాయి. ఈ కేసులన్నింటిలోనూ సుప్రీంకోర్టు గతంలో బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఆయనిప్పుడు జైలు నుంచి విడుదలయ్యేందుకు మార్గం సుగమమైంది. లక్నో కోర్టు బెయిల్ దరఖాస్తును తిరస్కరించటంతో కప్పన్ హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ దినేశ్ కుమార్ సింగ్ సింగిల్ జడ్జి ధర్మాసనం ఆయనకు శుక్రవారం బెయిల్ మంజూరుచేసింది. మనీలాండరింగ్ కేసులో కప్పన్, కె.ఎ.రవూఫ్ షరీఫ్, అతికుర్ రహమాన్, మసూద్ అహ్మద్, మహమ్మద్ ఆలం, అబ్దుల్ రజాక్, అష్రఫ్ ఖాదిర్‌లపై లక్నో కోర్టు ఇటీవల ఆరోపణలను నమోదు చేసింది. ఈ నిందితులపై ప్రాసిక్యూషన్ కంప్లయింట్‌ను ఎన్‌ఫోర్స్‌మేంట్ డైరెక్టరేట్ గతంలో దాఖలు చేసింది. కప్పన్‌ను 2020 అక్టోబర్‌లో ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ రాష్ట్రంలోని హత్రాస్‌లో ఓ దళిత యువతి లైంగికదాడికి గురై, హత్యకు గురికావడంతో, ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు కప్పన్..మరికొందరు ఆ గ్రామానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు.

మాట్లాడనివ్వరేం?

- మహారాష్ట్ర అసెంబ్లీని బహిష్కరించిన ప్రతిపక్షాలు

నాగపూర్ : తమకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని విమర్శిస్తూ మహారాష్ట్ర శాసన సభ, విధాన పరిషత్‌లను ప్రతిపక్షాలు శుక్రవారం బహిష్కరించాయి. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఎన్‌సిపి, శివసేన (ఉద్ధవ్‌థాకరే గ్రూపు), కాంగ్రెస్‌లతో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) సభ్యులు విధాన్ భవన్ కాంప్లెక్స్ ప్రాంగణంలో పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఎన్‌సిపి ఎమ్మెల్యే జయంత్ పాటిల్‌పై గురువారం స్పీకర్ నిషేధం విధించడాన్ని ఖండించారు. విధాన్ భవన్ కాంప్లెక్స్ మెట్లపై అజిత్ పవార్, ఆదిత్య థాకరే, భాస్కర్ జాదవ్ తదితర నేతలు ఏక్‌నాథ్ షిండే-బిజెపి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినదించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల నోరునొక్కేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని నిరసిస్తూ ఉభయసభలను బహిష్కరిస్తున్నామని ఎంవిఎ నేతలు తెలిపారు. మహారాష్ట్ర శాసనసభా శీతాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకూ జరగనున్నాయి.

విశాఖలో క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం


క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న మంత్రి రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో మూడు రోజులపాటు జరగనున్న క్రెడాయ్ ఎనిమిదో ప్రాపర్టీ ఎక్స్‌పో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థిరాస్తి రంగంలో క్రెడాయ్ ఎంతో నమ్మదగిన సంస్థగా దేశ వ్యాప్త గుర్తింపు పొందిందన్నారు. రానున్న కాలంలో విశాఖకు మరింత ప్రాధాన్యత పెరగనుందని, దేశ రాజకీయాలను శాసించే విధంగా ఈ మహానగరం ఎదుగుతోందని తెలిపారు. త్వరలోనే పాలనా రాజధాని కానున్న నేపథ్యంలో ఇక్కడ స్థిరాస్తులు కొనుగోలు చేసుకోవాలనుకునే వారికి ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. క్రెడాయ్ చైర్మన్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం 400 మంది క్రెడాయ్‌లో సభ్యత్వం కలిగి ఉన్నారని, యూత్ వింగ్‌లో 60 మందితో, వుమెన్ వింగ్‌లో 30 మందితో కార్యకలాపాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో రూ.30 లక్షల నుంచి రూ.3 కోట్ల వరకూ విలువైన గృహాలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. ఆసక్తి గలవారికి లోను సదుపాయం కల్పించేందుకు బ్యాంకులు కూడా ఇక్కడే సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం కె.సుబ్బరాజు మెమోరియల్ అవార్డులను గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచర్ల రమేష్‌బాబు, విఎంఆర్‌డిఎ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, ఎస్‌బిఐ జిఎం కిషన్ శర్మ, క్రెడాయ్ అధ్యక్షులు కెఎస్‌ఆర్‌కె.సాయిరాజ్, ఉపాధ్యక్షులు వి.ధర్మేంద్ర, సిహెచ్.గోవిందరాజు, వి.శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

వేగంగా గుంటూరు, విజయవాడ అభివృద్ధి

- మూడు రాజధానులు వచ్చినా ఢోకా లేదు
- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు-విజయవాడ నగరాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ఈ రెండు నగరాలు త్వరలో కలిసిపోతాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు. గుంటూరులోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరేడ్కో) ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మంత్రి అంబటి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో ఉందన్నారు. అదేవిధంగా మూడు రాజధానులు వచ్చినా గుంటూరు-విజయవాడ నగరాల ప్రభావం ఏమాత్రమూ తగ్గదని తెలిపారు. ఈ రెండు నగరాలకు సమీపంలో కృష్ణా నది ఉందని, జాతీయ రహదారి అనుసంధానంగా ఉండడం వల్ల అభివృద్ధికి ఢోకా లేదన్నారు. ఇప్పటికే ఈ రెండు నగరాల మధ్య నిర్మాణాలు బాగా జరుగుతున్నాయన్నారు. నరేడ్కో చైర్మన్ హరిబాబు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోందని తెలిపారు. ఎమ్మెల్యేలు నంబూరు శంకరరావు, మద్దాలి గిరి, మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ మూడు రాజధానుల అంశం కొనసాగుతున్నా రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా దూసుకెళ్తోందని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రియల్టర్లు బత్తుల సురేష్‌బాబు, హరిశంకర్‌రెడ్డి, చుక్కపల్లి రమేష్, గద్దె తిరుపతిరావు, మల్లికార్జున్‌రావు, మామిడి రాము, సీతారామయ్య, టి.యోగయ్య పాల్గొన్నారు.

రుణాల జారీలో 15% వృద్ధి అంచనా

శ్రీరామ్ ఫైనాన్స్ సిఇఒ వెల్లడి

హైదరాబాద్ : వచ్చే రెండు, మూడేళ్లలో రుణాల జారీలో సగటున 12-15 శాతం వృద్ధి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని శ్రీరామ్ ఫైనాన్స్ ఎండి, సిఇఒ వైఎస్ చక్రవర్తి తెలిపారు. ప్రస్తుతం కంపెనీ జారీ చేసిన రుణాల విలువ (అసెట్ అండర్ మేనేజ్‌మెంట్ - ఎయుఎం) రూ.1.71 లక్షల కోట్లుగా ఉందన్నారు. 67 లక్షల మంది ఖాతాదారులున్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన ఆ కంపెనీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఉమేష్ రేవన్కర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో 498 శాఖల్లో 13.5 లక్షల కస్టమర్లున్నారన్నారని చక్రవర్తి తెలిపారు. ఈ ప్రాంతాల్లో రూ.33వేల కోట్ల ఎయుఎం నమోదయ్యిందన్నారు. ఇరు రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ద్విచక్ర వాహన రుణ మార్కెట్‌లో 25 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉన్నామన్నారు. వాణిజ్య వాహన మార్కెట్‌లోనూ 20 శాతం పైగా వాటాను కలిగి ఉన్నామన్నారు. కొత్తగా సప్లయి చెయిన్, విద్యా రుణాల జారీలోకి ప్రవేశించాలని నిర్దేశించుకున్నామన్నారు.

వేరుపడ్డ ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్‌లు

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక ఫోన్ పే, ఇ- కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లు వేరుపడ్డాయి. ఇరు సంస్థల మధ్య యాజమాన్య హక్కుల బదిలీ ప్రక్రియ ముగిసినట్లు ఆ రెండు కంపెనీలు శుక్రవారం ధృవీకరించాయి. దీంతో ఇక నుంచి ఈ రెండు సంస్థలు విడి విడిగా పనిచేయనున్నాయి. అయితే.. ఈ రెండిటిలోనూ వాల్‌మార్ట్ ప్రధాన వాటాదారుడిగా కొనసాగనుంది. యాజమాన్య విభజన వల్ల ఇరు కంపెనీల విలువ పెరిగి వాటాదారులకూ ప్రయోజనం చేకూరుతుందని సంయుక్త ప్రకటనలో తెలిపాయి. అక్టోబరులోనే ఫోన్‌పే తమ నమోదిత కార్యాలయాన్ని సింగపూర్ నుంచి భారత్‌కు తరలించింది. ఫోన్ పే, ఫ్లిప్‌కార్ట్ కంపెనీల సింగపూర్ సంస్థలకు చెందిన వాటాదారులు ఫోన్ పే ఇండియాలో నేరుగా షేర్లను కొనుగోలు చేశారు. దాంతో ఫోన్ పే ఇకపై పూర్తిగా భారత్‌కు చెందిన కంపెనీగా మారనుంది.

ఫోన్ పే ఐపిఒకు వెళ్లనున్న నేపథ్యంలో ప్రస్తుత నిర్ణయం ఆ సంస్థ విలువను భారీగా పెంచడానికి దోహదం చేస్తుందని నిపుణుల అంచనా.

పశ్చిమ సెక్టార్‌లో సమస్యల పరిష్కారానికి చర్చలు

భారత్, చైనా అంగీకారం

న్యూఢిల్లీ : వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్‌ఎసి) పొడవునా పశ్చిమ సెక్టార్‌లో మిగిలిన సమస్యలన్నింటికీ సాధ్యమైనంత త్వరగా పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారమార్గాన్ని రూపొందించేందుకు చైనా, భారత్ అంగీకరించాయి. సన్నిహిత సంబంధాలను సాగిస్తూ, సైనిక, దౌత్య మార్గాల ద్వారా చర్చలను కొనసాగించడం ద్వారా పరిష్కార మార్గంపై కసరత్తు చేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు చైనా-భారత్ 17వ దఫా కార్ప్స్ కమాండర్ స్థాయి సమావేశంలో సంయుక్త పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనను భారత విదేశాంగ శాఖ, చైనా రక్షణ మంత్రిత్వశాఖలు గురువారం ప్రచురించాయి. ఎల్‌ఎసి పొడవునా గల సమస్యల పరిష్కారంపై ఇరు వర్గాలు పారదర్శకంగా, నిర్మాణాత్మకంగా అభిప్రాయాలు పంచుకున్నాయి. మంగళవారం చైనా భూభాగంలోని చుషుల్-మోల్డో సరిహద్దు వద్ద ఈ సమావేశం జరిగింది. పశ్చిమ సెక్టార్‌లో ఎల్‌ఎసి పొడవునా శాంతి భద్రతలు, సుస్థిరత కొనసాగించేందుకు, ఉభయ పక్షాలు ఏకాభిప్రాయంతో వున్నట్లు సంయుక్త ప్రకటన తెలియజేస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు. పశ్చిమ సెక్టార్‌లోని సమస్యలపై జరిగే చర్చలను, తూర్పు సెక్టార్‌లో సమస్యల పరిష్కారానికి జరిగే చర్చలను విడిగా చూడాలన్నారు.

ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి

పోలీసు అధికారి మృతి, పలువురికి గాయాలు

ఇస్లామాబాద్ : రాజధాని ఇస్లామాబాద్‌లో చెక్‌పాయింట్ వద్ద శుక్రవారం ఆత్మాహుతి కారు బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఒక పోలీసు అధికారి మరణించగా, పలువురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఆ కారులో ఒక పురుషుడు, ఒక మహిళ వున్నారని ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోందని ఇస్లామాబాద్ ఆపరేషన్స్ పోలీసు చీఫ్ సోహైల్ జఫర్ మీడియాకు తెలిపారు. చెక్‌పాయింట్ వద్ద కారును ఆపడానికి పోలీసులు ప్రయత్నించినా కారు ఆగలేదని తెలిపారు. దాంతో పోలీసులు కారును వెంబడించడంతో కారులో వున్నవారు కారును పేల్చివేశారన్నారు. ఇది ఆత్మాహుతి దాడేనని అన్నారు. ఈ దాడికి తమదే బాధ్యత అని ఇంతవరకు ఎవరూ ప్రకటించలేదు.

పాతవి తీస్తారు.. కొత్తవి ఇస్తారు..!

- పింఛన్ల ఏరివేతకు సచివాలయ సిబ్బందికి ఆదేశాలు..
- ప్రతి సచివాలయ పరిధిలో 5 నుంచి 15 పింఛన్లు కోత
- వాటి స్థానంలో జనవరిలో కొత్త పింఛన్లు
- విద్యుత్ బిల్లుల సాకుతో ఏరివేతకు ప్రణాళిక
- రెండు జిల్లాల్లో పింఛన్ లబ్ధిదారులు 4.83 లక్షల మంది

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఒక ప్రాణం తీశా.. మరో ప్రాణం పోశా.. లెక్క సరిపోయింది' అంటూ ఓ సినిమాలో విలన్ చెప్పిన డైలాగ్ సామాజిక పింఛన్ల మంజూరులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు అతికినట్లు సరిపోతుంది. ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్ల మంజూరు చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అదే సమయంలో ఆరు నెలలకోసారి విద్యుత్ బిల్లులతోపాటు అనేక సాకులు చూపుతూ ఉన్న పింఛన్లను తొలగించే ప్రక్రియకు సైతం ప్రభుత్వం పూనుకుంటుంది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం వచ్చే జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో 2.65 లక్షల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 2.18 లక్షల మంది సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. వీటిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వంటి పలు రకాల పింఛన్లు ఉన్నాయి. అర్హత ఉండి కూడా అనేక మందికి పింఛన్లు అందని పరిస్థితి ఉంది. వీరంతా కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఇలాంటి వారు ఏలూరు జిల్లాలో దాదాపు పది వేల మంది ఉండగా, పశ్చిమగోదావరి జిల్లాలో ఐదువేలకుపైగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం ఉన్న పింఛన్లను తొలగించేందుకు పూనుకుంది. పింఛను అందుకుంటున్న వారి కరెంటు బిల్లులను ఆరు నెలల సరాసరి పరిశీలించి 300 యూనిట్లు దాటితే పింఛన్ నిలిపివేస్తోంది. ఈ కాలంలో ఇంట్లో ఏదైనా వివాహం, వేరే వేడుకలు జరిగి విద్యుత్ బిల్లు పెరిగితే పింఛన్ ఆగిపోయినట్టే. ఇలా పలు నిబంధనలను తెరపైకి తెచ్చి పింఛన్లను ఆపేస్తోంది. పరిశీలన పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో ఐదు నుంచి 15 పింఛన్లు వరకూ ఏరివేత జాబితాలో చేరాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 1165 వరకూ గ్రామ, పట్టణ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కో సచివాలయ పరిధిలో పది పింఛన్లు ఏరివేసినా 11 వేలకుపైగా పింఛన్లు నిలిచిపోయే పరిస్థితి ఉంది. ఏరివేత జాబితా సంఖ్య గురించి ఏఒక్క అధికారీ సమాధానం చెప్పని పరిస్థితి నెలకొంది. 20, 30 ఏళ్ల క్రితం కట్టిన ఇళ్లకు విద్యుత్ మీటర్లన్నీ దాదాపుగా ఇంటి పెద్ద పేరుపైనే ఉన్నాయి. కుమారులు ఆ ఇంట్లో ఉంటున్నప్పటికీ పింఛన్ అందుకుంటున్న వ్యక్తి పేరుపైనే విద్యుత్ మీటర్ నడుస్తోంది. కుమారులు విద్యుత్ వాడుకుంటే ఏసంబంధం లేని వృద్ధుల పింఛన్ ఆపేస్తున్నారు. ఇలాంటివి అనేక ఇబ్బందులు ఉన్నాయి.

పింఛన్ల మాయ

ప్రతి ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు ఇస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ఏరివేసిన పింఛన్ల గురించి మాత్రం చెప్పడం లేదు. కొత్త పింఛన్లు ఎన్ని మంజూరు చేస్తే దాదాపు అదేస్థాయిలో పాత పింఛన్లు తొలగిస్తున్నారు. పింఛన్లు సంఖ్య పెరగకుండా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. పింఛన్ల ఏరివేతకు సంబంధించిన వివరాలు డిఆర్‌డిఎ కార్యాలయ సిబ్బంది తమకు తెలియదని చెబుతున్నారు. నేరుగా సచివాలయ సిబ్బంది లాగిన్‌లోకి పంపించి పింఛన్ల ఏరివేత చేపడుతున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ వంటి రాష్ట్రంలో 300 యూనిట్లు వరకూ ఉచిత విద్యుత్ ఇస్తుంటే ఇక్కడ మాత్రం మూడొందల యూనిట్లు విద్యుత్ వాడుకుంటే సంక్షేమ పథకాలు ఆపేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో కొత్త పింఛన్ల మంజూరులో ప్రభుత్వ కపట నాటకం ఆడుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. జనవరి నుంచి రూ.2500గా ఉన్న పింఛన్ రూ.2,750కు పెరగనుంది. ఈ తరుణంలో పింఛన్ల ఏరివేత ఎంతోమంది లబ్ధిదారులకు తీరని వేదన మిగుల్చుతోంది.



తిరుమల ఘాట్‌రోడ్డులో చిరుతకూన మృతి

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల ఘాట్ రోడ్డులో ఓ చిరుతకూన మృత్యువాతపడింది. రెండవ ఘాట్‌రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద శుక్రవారం తెల్లవారుజామున చిరుతకూన రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొన్నది. దీంతో అక్కడికక్కడే మరణించింది. అటవీశాఖ అధికారులు ఘటనాస్థలికి చేరుకుని మృతిచెందిన చిరుతకూనను తిరుపతి జూపార్క్‌కు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి, ఖననం చేశారు.

అత్యాచారంకేసులో జీవిత ఖైదు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ చిత్తూరు పోక్సో కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. 2014లో చిత్తూరు జిల్లా గంగవరం మండలం మారేడుపల్లి గ్రామానికి చెందిన బాలాజీ అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని రిమాండ్ తరలించారు. విచారణ అనంతరం జీవితఖైదు, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి శాంతి తీర్పునిచ్చారు.

కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు


3ఎఫ్ యాజమాన్యంతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలోని ఫుడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు చరణ్, దుర్గాప్రసాదును ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదంలో తీవ్రగాయాలైన కార్మికులను ప్రభుత్వం, పరిశ్రమ యాజమాన్యం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీల్లో తరుచూ ప్రమాదాలు జరగడం, కార్మికులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వివిధ పరిశ్రమల్లో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలపై ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సంబంధిత అధికారుల తనిఖీలు లేకపోవడమే ఇలాంటి ఘటనలకు కారణమన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కార్మిక చట్టాలు సక్రమంగా అమలు చేయాలని,. నిబంధనలు, చట్టాలు అమలు చేయని పరిశ్రమల యాజమాన్యాలుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శిం చేందుకు వచ్చిన 3 ఎఫ్ పరిశ్రమల వైస్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, హెచ్‌ఆర్ జిఎం జనార్ధన్‌ను తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్మికులను పరామర్శించినవారిలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, 3 ఎఫ్ ఫ్యాక్టరీస్ యూనియన్ అధ్యక్షులు పి గణేశ్వరావు, కార్యదర్శి పి శ్రీనివాసు ఉన్నారు.

ఎప్పటికప్పుడు రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో రైతుల ఖాతాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం డబ్బులు జమ చేస్తున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 13.14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, దానికి సంబంధించి రైతుల ఖాతాల్లో రూ.751 కోట్లు జమ చేశామని చెప్పారు. ధాన్యం గోనె సంచులు రైతులే భరిస్తే, ఒక్కో సంచికి రూ.3.50 చొప్పున ఇస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో దళారి వ్యవస్థ లేకుండా చేశామని, దేశంలో ఎక్కడా లేని విధంగా మద్దతు ధర కల్పిస్తున్నామని చెప్పారు. తడిచిన ధాన్యాన్ని సైతం ఏడు కేజీలు తగ్గించి కొనుగోలు చేస్తున్నామని అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఏపి భవన్‌లో మంత్రి మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి పియూష్ గోయల్, ఎఫ్‌సిఐ చైర్మన్ అశోక్ మీనాలతో భేటీ అయినట్లు వివరించారు. 2012-13 నుంచి 2017-18 వరకు రాష్ట్రానికి ఇవ్వాల్సిన రూ.1,702.90 కోట్లు పెండింగ్ మొత్తాన్ని విడుదల చేయాలని కోరామన్నారు. రైతులకు వరి రవాణా ఛార్జీలు చెల్లిస్తున్న విధంగానే వరి ప్యాకింగ్‌కు ఉపయోగించే గోనె సంచులను రైతులు ఏర్పాటు చేసుకుంటే ఆ మొత్తాన్ని చెల్లించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఖరీఫ్ (2022-23) ప్రొవిజనల్ కాస్ట్ షీట్‌లో మండి లేబర్ చార్జీల (ఎంఎల్‌సి) రేట్ షెడ్యూల్ చేర్చాల్సిందిగా కోరామన్నారు. స్మార్ట్ పిడిఎస్ కింద రాష్ట్ర స్థాయిలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రం నిధులు విడుదల చేయాలని కోరామని మంత్రి తెలిపారు. బాయిల్డ్ రైస్‌ను రాష్ట్రం నుంచి సేకరించే విషయమై చర్చించాలని ఎఫ్‌సిఐ చైర్మన్ అశోక్ మీనాను కోరారు.

జాతీయ గొర్రెలు, మేకల పెంపకందారుల బోర్డు ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రికి వైసిపి ఎంపి మస్తానరావు వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమం కోసం జాతీయ గొర్రెలు, మేకల పెంపకందారుల బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాలాకు వైసిపి ఎంపి బీద మస్తానరావు విజ్ఞప్తి చేశారు. గొర్రెలు, మేకలు అనుబంధ ఉత్పత్తులపై 10 కోట్లమందికి పైగా ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. ఉత్పాదకతలో వెనుకంజ నేపథ్యంలో గొర్రెలు, మేకలపై విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. ఈ మేరకు లైవ్‌స్టాక్ అగ్రికల్చర్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ బృందం, ఆంధ్రప్రదేశ్, బీహార్, యుపి, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, జమ్ముకాశ్మీర్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ సమన్వయకర్తలతో కలిసి కేంద్రమంత్రికి మస్తానరావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

కడపలో ఉక్కు పరిశ్రమ కోసం ఆందోళనలు : కాంగ్రెస్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం, ఎపి ప్రత్యేక హోదా కోసం త్వరలో ప్రజా ఆందోళనలు చేపడతామని ఎపిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చెప్పారు. శుక్రవారం నాడిక్కడ ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే అధ్యక్షత జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, అన్ని రాష్ట్రాల ఇన్‌చార్జ్‌లు, పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నేతలు పాల్గొన్నారు. సమావేశ అనంతరం గిడుగు రుద్రరాజు మీడియాతో మాట్లాడుతూ జిల్లా, గ్రామ స్థాయిలో ప్రజా ఆందోళనలకు కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తామన్నారు.

ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు నేడు విడుదల

తిరుమల : శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం కోసం శనివారం ఉదయం తొమ్మిది గంటలకు టికెట్లను విడుదల చేయనున్నారు. జనవరి రెండో తేదీ నుంచి 11వ వరకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల కోటాను టిటిడి వెబ్‌సైట్‌లో విడుదల చేయనున్నట్లు టిటిడి ఓ ప్రకటనలో పేర్కొంది. టికెట్లు పొందిన వారు మాత్రమే దర్శనానికి రావాలని పేర్కొంది.


'టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా మార్చండి'

న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభల్లో తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్) పేరును భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్) గా మార్చాలని ఆ పార్టీ ఎంపీలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పార్లమెంట్‌లో లోకసభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంఖర్‌లను టిఆర్‌ఎస్ ఎంపీలు కె కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, సంతోష్, సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బిబి పాటిల్ కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పేరు మార్పుపై కేసిఆర్ పంపిన లేఖను అందజేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించకుంటే

సిఎం జగన్ పర్యటనను అడ్డుకుంటాం

మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు


వినతిపత్రం ఇస్తున్న అయ్యన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్

రైతుల సమస్యలను పరిష్కరించక పోతే ఈనెల 28న నర్సీపట్నంలో సీఎం జగన్ పర్యటనను అడ్డుకుంటామని మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా ఆధ్వర్యంలో నర్సీపట్నంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. సిబిఎం కాంపౌండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్ స్టేషన్, అబీసెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వైసీపీ రైతు వ్యతిరేక నిర్ణయాలతో అన్నదాతలు ఎన్నడూ లేని విధంగా సంక్షోభంలోకి కూరుకుపోయారన్నారు. పండించే పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. భూములు గుర్తించి దోచుకోవ డానికే భూముల రీ సర్వే చేపడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్ ఫొటోలతో పాసు పుస్తకాలు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్లో భారీ కుంభకోణం చేశారన్నారు. అనంతర చోడవరం మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత, మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయడులు మాట్లాడారు. ఆర్డీవో కార్యాలయంలో ఏఒ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-యలమంచిలి

మూడురోజుల పాటు జరుగు రాష్ట్రస్థాయి 6వ అంతర్ జిల్లాల బాల బాలికల సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలను స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో శుక్రవారం ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలన్నా, క్రీడాకారులన్నా తనకు చిన్న తనం నుంచే ప్రత్యేక గౌరవమని ఉందని తెలిపారు. క్రీడాలు దేహదారుఢ్యానికే కాదని, గెలుపోటములను ఎదుర్కొనే మానసిక పరివర్తనకు కూడా దోహదం చేస్తాయని చెప్పారు. డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, ఎంపిపి బోదెపు గోవిందరావు, వైసిపి నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వందలాది మంది క్రీడాకారులకు ఆతిథ్యం ఇచ్చే బాధ్యత స్వయంగా ఎమ్మెల్యే తీసుకున్నట్టు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు గుప్తా, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదరాజు, పైసా మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

సిఎస్‌ను కలిసిన వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి (సిఎస్) కెఎస్ జవహర్‌రెడ్డిని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి శుక్రవారం కలిశారు. రెండోసారి గెలుపొందిన నేపథ్యంలో కార్యవర్గ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు.

వార్డు అమెనిటీస్ కార్యదర్శులకు జాబ్ చార్టు అమల్జేయాలి

- డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వార్డు అమెనిటీస్ కార్యదర్శులకు జాబ్ చార్ట్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సమస్యల పరిష్కారం కోరుతూ వడ్డేశ్వరంలోని మున్సిపల్ పరిపాలనాశాఖ ప్రధానకార్యాలయంలో ఆశాఖ కమిషనరు, డైరెక్టర్ ప్రవీన్‌కుమార్‌ను కలిసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ట్రావెలింగ్ అలవెన్స్ ఇవ్వాలని, కాంట్రాక్టర్లకు నోటీసు జారీచేసే అధికారం కల్పించాలని, ఇ - ఆఫీసు లాగిన్ ఇవ్వాలని, ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వారికి అదనపు అలవెన్స్ ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజనీరు పోస్టులను ఎమినిటీస్ కార్యదర్శులతో భర్తీ చేయాలని, అత్యవసర పనుల కోసం రూ.50 వేల తగ్గకుండా టెక్నికల్ అధికారం కల్పించాలని, బిఎల్ఓ డ్యూటీలు, శాఖేతర పనులు మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. నీటిపన్ను వసూళ్ల చేయడం నుంచి మినహాయింపు నివ్వాలని, వార్డు, పారిశుద్ధ్య , పర్యావరణ కార్యదర్శులకు చెత్తపన్ను వసూలు నుంచి మినహాయింపు నివ్వాలని కోరారు. కమిషనరును కలిసిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థమధు, గుంటూరు జిల్లా కో ఆర్డినేటర్ టాటా వెంకటసాయి మణికంఠ, బాపట్ల జిల్లా కో ఆర్డినేటర్ పాదర్ల సతీష్, ఎన్‌టిఆర్ జిల్లా కో ఆర్డినేటటర్ నవీన్, పాల్గొన్నారు.

రాష్ట్ర రైతుపైనే అత్యధిక రుణభారం

- ఒక్కో రైతు కుటుంబానికి రూ.2,45,554 అప్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోనే అత్యధిక రుణభారం ఆంధ్రప్రదేశ్ రైతులపై ఉంది. రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018 జులై - 2019 జూన్ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.2,45,554 అప్పు ఉందని చెప్పారు. తెలంగాణలో ప్రతి రైతు కుటుంబంపైన రూ.1,52,113 రుణ భారం ఉందని తెలిపారు. దేశంలో సగటున ఒక్కో రైతు కుటుంబంపై రూ.74,121 రుణభారం ఉందని పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 7 వరకూ ఆంధ్రప్రదేశ్‌లో వరదలు, భారీ వర్షాల వల్ల 12,043.19 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని నరేంద్ర సింగ్ తోమర్ మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

8 నెలల్లో ఎఫ్‌డిఐలు 0.5 శాతమే

ఆంధ్రప్రదేశ్‌లో గత తొమ్మిది నెలల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 0.5 శాతం మాత్రమే వచ్చాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సోం ప్రకాశ్ తెలిపారు. రాజ్యసభలో సిపిఐ ఎంపి పి.సంతోష్ కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన విదేశీ పెట్టుబడుల 217.8480 మిలియన్ల యుఎస్ డాలర్లు (శాతం 0.5125) మాత్రమేనని అన్నారు. దేశ వ్యాప్తంగా ఎఫ్‌డిఐలు పొందిన రాష్ట్రాల్లో పదో స్థానంలో ఏపి ఉందని అన్నారు.

అమరావతి సింగిల్ లైన్ రైల్వే ప్రాజెక్టు డిపిఆర్‌లో మార్పులు

అమరావతి సింగిల్ లైన్ రైల్వే ప్రాజెక్టు డిపిఆర్‌లో మార్పులు చేసే పనిలో జోనల్ రైల్వే ఉందని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. టిఆర్ఎస్ ఎంపి కె.ఆర్ సురేష్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం అమరావతికి రైలు కనెక్టివిటీ కోసం విజయవాడ-గుంటూరు వయా అమరావతి ప్రాజెక్టును 2017-18 బడ్జెట్‌లో ప్రభుత్వ అవసరాలకు లోబడి చేర్చినట్లు తెలిపారు. తక్కువ ట్రాఫిక్ అంచనాలు, తక్కువ రాబడి కారణంగా ప్రాజెక్ట్ ఖర్చు భాగస్వామ్యం కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని సంప్రదించగా, వ్యయ భాగస్వామ్యానికి అంగీకరించలేదని తెలిపారు. దీంతో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు డిమాండ్ మేరకు ఈ విషయం పునఃపరిశీలిస్తున్నామని తెలిపారు.

నిలిచిన కోటిపల్లి-నర్సాపూర్ ప్రాజెక్టు

రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకపోవడంతోనే కోటిపల్లి-నర్సాపూర్ (57.21 కిలోమీటర్లు) కొత్త రైల్వే ప్రాజెక్టు నిలిచిపోయిందని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. టిడిపి ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2000-01లో రూ.2,120 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు మంజూరైందని, రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు రూ.1,091 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు.

'ప్రత్యామ్నాయం'తో గంజాయికి అడ్డుకట్ట

- ఏపి పోలీస్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గంజాయి సాగు, అక్రమరవాణా నియంత్రించేందుకు పోలీస్‌లు చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎపి పోలీస్ ఒక ప్రకటనలో తెలిపింది. డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పర్యవేక్షణతో రాష్ట్రంలో గంజాయి నిర్మూలకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. రాష్ట్రంలో 7500 ఎకరాల్లో గంజాయిసాగు జరిగేదని ఇపుడు అక్కడ ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. విశాఖ ప్రాంతంలోని జి మాడుగుల, జికె వీధి, చింతపల్లి, పెద్దబయలు, ముచంగిపుట్ట, దంబ్రిగుడ, పాడేరు మండలాలలో గంజాయి సాగుని గణనీయంగా నిర్మూలించడంలో సఫీలీకృతమైనట్లు పేర్కొంది. సిల్వర్ ట్రీ, పెప్పర్, కాఫి, పసుపు, మామిడి, కొబ్బరి మొక్కలు, జీడి మామిడి, రాగి, రాజ్మ, కంది పంట, అల్లం, వరిపంట, రబ్బర్ మొక్కలు, నిమ్మ, జాఫ్రా, పత్తి, నువ్వులు, పచ్చిమిర్చి, రాగులు, పల్లి, కూరగాయల విత్తనాలను అందిస్తూ ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 2,45,000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేయడం జరిగిందని పేర్కొంది. ఏజెన్సీలోని ప్రాంతాల నుండి గంజాయి రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతరం వాహనాల తనిఖీలు, ఏజెన్సీలోకి వచ్చే కొత్త వ్యక్తుల కదలికలపైన నిఘా కొనసాగించడం ద్వారా స్వాధీనం చేసుకున్న గంజాయి ఒరిస్సా లోని మల్కాంగిరి జిల్లా నుండి రవాణా అవుతున్నట్టుగా గుర్తించడం జరిగిందని వెల్లడించింది. పూర్తిస్థాయిలో అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఒరిస్సా రాష్ట్ర అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపింది.

రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్‌లో దక్షిణ మధ్య రైల్వే జిఎం తనిఖీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్‌జైన్ రాయనపాడు వ్యాగన్ వర్క్‌షాప్‌లో శుక్రవారం వార్షిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉద్యోగ విధి నిర్వహనలో హిందీ భాష వినియోగాన్ని , భాషపై అవగాహన కల్పించే లక్ష్యంతో హిందీ లైబ్రరీని జిఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మ ధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీరు జెకెజైన్, చీఫ్ వర్క్‌షాప్ మేనేజరు ఎస్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలను పరిష్కరించండి

- ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, రాష్ట్ర నాయకులు రంగారావులు శుక్రవారం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమీషనర్ అరుణ్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ధాన్యం పండించిన రైతులకు మద్దతుధరను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మాండూస్ తుఫాన్ మూలంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం రైతులు మరింత నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ప్రధానంగా గోనెసంచుల కొరతతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తేమశాతం ఆర్‌బికెలలో మిల్లర్ల వద్ద వేర్వేరుగా వస్తోందని వివరించారు. ధాన్యంను కాటా వేసిన వెంటనే రైస్‌మిల్లుకు పంపితే ఈ సమస్యరాదని వివరించారు. అలాగే మిల్లుకు పంపిన ఏడు రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బును వేయాలని కోరారు. తుఫాన్, భారీవర్షాలకు తడిసిన ధాన్యంను మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కౌలురైతులకు ఈ క్రాప్ నిబందనను సడలించాలని వివరించారు. కాటాకూలి, రవాణా చార్జీలను నేరుగా రైతులకు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

సిఆర్‌డిఎ పారిశుద్ధ కార్మికుల వేతనాలు జమ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎపిసిఆర్‌డిఎ) పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల వేతనాలు జమ చేశారు. నవంబర్ వరకు రూ.86.38 లక్షలు చెల్లించిన్నట్లు సిఆర్‌డిఎ కమిషనర్ వివేక్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 295 మంది కార్మికులకు సెప్టెంబర్ వరకు వేతనాలు గురువారం జమ చేశామని తెలిపారు. అక్టోబర్, నవంబర్ వేతనాలు శుక్రవారం జమ చేసిన్నట్లు పేర్కొన్నారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 23 వరకు జీతాలను కూడా సిద్ధం చేయాలని ఏజెన్సీ సంస్థకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

రాజధాని ప్రాంత పారిశుద్ధ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు గురువారం చేపట్టిన ఆందోళన ఫలితంగానే వేతనాలు జమ చేసిన్నట్లు ఆ సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, అధ్యక్షులు చెరుకూరి సుశీల, కార్యదర్శి రాచూరి వేణు, సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి నుంచి కార్మికులకు పని గ్యారెంటీ ఉన్నట్లుగా సిఆర్‌డిఎ అధికారులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్పందించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని, రాష్ట్ర సచివాలయం వద్ద నిరసనలు చేపడతామని హెచ్చరించారు. పని గ్యారంటీ కోసం చేసే ఆందోళనకు రాజధాని గ్రామాల్లోని ప్రజలు, పెద్దలు మద్దతు తెలపాలని కోరారు.



బాలకృష్ణ, పవన్ కల్యాణ్ భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సినిమాలతోపాటు రాజకీయాల్లో కూడా రాణిస్తున్న నటులు బాలకృష్ణ, పవన్ కల్యాణ్ శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీకి హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియో వేదిక అయింది. బాలకృష్ణ నటిస్తున్న వీరసింహారెడ్డి, పవన్ నటిస్తున్న హరిహర వీరమల్లు చిత్రాల షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోలో జరిగింది. విశ్రాంతి సమయంలో ఇద్దరూ ఏకాంతంగా అరగంట సేపు భేటీ అయ్యారు. అనంతరం యూనిట్ సభ్యులతో కలిసి ఫోటోలు దిగారు. ఇప్పుడు ఈ వార్త తెలుగు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

రాజధానిలో రైతులకు ప్లాట్లు ఇచ్చాం

- హైకోర్టుకు తెలిపిన ప్రభుత్వం

ప్రజాశక్తి, అమరావతి

రాజధాని ప్రాంతంలో అమరావతి రైతులకు ఇళ్ల స్థలాల కేటాయింపులు జరిగినట్లు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. రాజధాని ప్రాంతంలో వేరే ప్రాంతాల వాళ్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వరాదన్న కేసులో ఆ విషయాన్ని అదనపు ఏజీ పి.సుధాకర్‌రెడ్డి చెప్పారు. అమరావతి రైతులకు చట్ట ప్రకారం ప్లాట్లను ఇవ్వడమే కాకుండా 66.83 శాతం ప్లాట్ల రిజిస్ట్రేషన్ అయ్యిందని, అయితే ప్లాట్లను తీసుకోలేదని తప్పుగా చెబుతున్నారని అన్నారు. వీటికి చెందిన పత్రాలు ఎక్కువగా ఉన్నందున ఒక గ్రామానికి రెండు మూడు డాక్యుమెంట్స్ అందజేయాలని ప్రభుత్వానికి జస్టిస్ యు. దుర్గా ప్రసాద్, జస్టిస్ టి. మల్లిఖార్జులరావుల ధర్మాసనం శుక్రవారం ఆదేశించింది. రాజధాని ప్రాంతంలో రైతులకు 63452 ప్లాట్లు కేటాయించగా, అందులో 42429 ప్లాట్లను రిజిష్టర్ చేసినట్లు ఏజీ చెప్పారు. మరో 21023 ప్లాట్లు రిజిష్టర్ చేయాలన్నారు. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

'మార్గదర్శి'పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

చిట్‌ఫండ్ చట్ట నిబంధనలను అమలు చేస్తున్నందున తమకు ప్రభుత్వం పెనాల్టీ చెల్లించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ వేసిన అనుబంధ పిటిషన్లపై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రై వేట్ లిమిటెడ్ తరఫున బి.శ్రీనివాసరావు వేసిన ఐఎలో శుక్రవారం ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. ఉత్తర్వుల్ని తర్వాత వెలువరిస్తామని జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి శుక్రవారం ప్రకటించారు.చట్ట ప్రకారమే చిట్ నిర్వహణ ఉందని, చిట్ డబ్బుపై సెక్యూరిటీ మొత్తాన్ని రిజిస్ట్రార్ వద్ద జమ చేస్తున్నామని మార్గదర్శి తరఫున న్యాయవాది చెప్పారు. ఫోర్‌మెన్ సెక్యూరిటీ ఇవ్వాలని చట్టంలో ఎక్కడా లేదన్నారు. తమ కంపెనీపై ఎలాంటి ఫిర్యాదు లేకపోయినా తనిఖీల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. చట్ట వ్యతిరేకంగా మార్గదర్శి చిట్‌ఫండ్ చర్యలు ఉన్నాయని ప్రభుత్వం తరఫున ఏజీ ఎస్.శ్రీరామ్ చెప్పారు. కొత్త చిట్ ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు పాత చిట్‌రికార్డుల్ని రిజిస్ట్రార్ పరిశీలన చేసే అధికారం ఉంటుందన్నారు.

నవరస నట సార్వభౌముడు...



1959లో సిపాయి కూతురు చిత్రంతో సినీరంగప్రవేశం చేసిన కైకాలకు సంబంధించిన సినీ ప్రస్థానంలోకి వెళ్తే.. స్టేజిపై నాటకం ఆడుతున్న సత్యనారాయణను ప్రజానాట్యమండలి వ్యవస్థాపకుడు గరికపాటి రాజారావు సినిమా ఇండస్ట్రీలోకి ఆహ్వానించారు. 'అప్పటికి నాకు సినిమాలపై ఆసక్తి ఉండేది కాదు. మా కుటుంబంలో డిగ్రీ సంపాదించిన వారు లేరు. డిగ్రీ పట్టా పొందిన తరువాతే ఏదైనా చేయాలని బలంగా అనుకునేవాణ్ణి. దీంతో ఆ అవకాశాన్ని తిరస్కరించాను' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు కైకాల. చదువు పూర్తయిన తరువాత ఇంటర్ రెండో సంవత్సరం నుంచి ఉన్న నాటకరంగ అనుభవంతో ఓ మిత్రుడి సూచన మేరకు అవకాశాల కోసం మద్రాసు రైలు ఎక్కారు. అలా మద్రాసు వెళ్లిన ఆయనను నటుడిగా గుర్తించారు డి.ఎల్.నారాయణ.. తొలి సినిమాతోనే కథానాయకుడి అవకాశాన్ని అందుకున్న కైకాల.. ఇంటి అద్దె కట్టలేక పార్కులో పడుకున్న సందర్భాలున్నాయి. పగలంతా వేషాల కోసం తిరగడం, రాత్రుళ్లు పార్కులో పడుకోవడం ఇలా 15 రోజులు గడిపారు. మొదటి పిక్చర్ నిరాశ మిగల్చడంతో విజయవాడకు వచ్చేద్దామని సిద్ధపడినప్పుడు దర్శకుడు విఠలాచార్య అవకాశమిచ్చి ఆదరించారు. 60 ఏళ్ల తన సినీప్రస్థానంలో దాదాపు 777 సినిమాల్లో నటించారు. ఆయన నటించిన చివరి చిత్రం మహేష్ బాబు నటించిన మహర్షి.. 28 పౌరాణిక, 51 జానపద, 9 చారిత్రక చిత్రాల్లో నటించారు.. 200 మందికి పైగా దర్శకులతో పనిచేశారు. 100 రోజులు ఆడిన కైకాల నటించిన చిత్రాలు 223 ఉన్నాయి.. అర్ధశతదినోత్సవాలు జరుపుకున్న సినిమాలు 59.. సంవత్సరం ఆడిన చిత్రాలు 10 ఉన్నాయి..

నవరస నట సార్వభౌమ అన్న బిరుదుకు తగ్గట్టుగా ఎన్నో వైవిధ్య పాత్రల్లో నటించారు కైకాల సత్యనారాయణ. పౌరాణిక, సాంఘిక, చారిత్రక, జానపద చిత్రాల్లో మెప్పించిన కైకాల ప్రతినాయక, నాయక పాత్రలతో పాటు హాస్యరస పాత్రల్లో కూడా మెప్పించారు. ఎస్‌విఆర్, ఎన్‌టిఆర్ తరువాత రావణ, దుర్యోధన, యముడి పాత్రల్లో అలరించిన ఏకైక నటుడు ఆయన. ఇద్దరు మహానటులు అనితరసాధ్యంగా అభినయించిన పాత్రలను పోషించి, మెప్పించడం అంటే ఆషామాషీ కాదు. కాని కైకాల దాన్ని సాధ్యం చేశారు. ఎన్నో పాత్రల్లో ఎస్‌వి రంగారావు లేని లోటు తీర్చారు. తెలుగు వెండితెరకు గంభీర హాస్య చమత్కార సరదాల విలనీని అందించి, సరికొత్త చరిత్ర సృష్టించారు.

కుటుంబం

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో 1935 జులై 25న జన్మించారు. గుడివాడ కళాశాల నుంచి డిగ్రీ పట్టా అందుకున్నారు. 1960 ఏప్రిల్ 10న నాగేశ్వరమ్మను వివాహం చేసుకున్నారు.. కైకాలకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు.. తన మనవళ్లలో ఒకరిని నటవారసుడిగా చూడాలనేది కైకాల కోరిక..

ఎన్‌టిఆర్‌తో విడదీయలేని అనుబంధం..

ఎస్‌విఆర్‌ను తండ్రిగా, ఎన్‌టిఆర్‌ను అన్నగా భావించేవారు కైకాల. 'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి' చిత్రంలో తొలిసారిగా ఎన్టీఆర్‌తో తెరను పంచుకున్నారు.. ఎన్టీఆర్‌తో కలిసి 101 చిత్రాల్లో నటించారు.. పోరాట సన్నివేశాల్లో ఎన్‌టిఆర్‌తో పోటాపోటీగా నటించి మెప్పించారు. విఠలాచార్య దర్శకత్వంలో 'కనకదుర్గ పూజ మహిమ' చిత్రంలో తొలిసారి ప్రతినాయకుడి పాత్ర పోషించారు. ఎన్టీఆర్ 'అగ్గిపిడుగు' చిత్రంతో కైకాల సినీ జీవితం మలుపు తిరిగింది.

దుర్యోధనుడి పాత్ర చేయాలంటే ఎస్‌వి రంగారావే చేయాలి. ఆయన కాకపోతే ఇండస్ట్రీలో ఎవరూ లేరు అన్న ధోరణికి ఆ పాత్రలు పోషించి సమాధాన మిచ్చారు కైకాల. ఆ పాత్రకు సరిపోరని నిర్మాతలు అభ్యంతరం చెప్పినా.. రామారావు ప్రోత్సాహంతో ఆ పాత్ర చేసి మెప్పించానని ఒక సందర్భంలో చెప్పారు. 'తన నటనా జీవితంలో ఎందరో దర్శకనిర్మాతలు ఉన్నట్లే రామారావు పాత్ర కూడా చాలా ముఖ్యమైంది' అంటారు గతస్మృతులు గుర్తుచేసుకుంటూ.. ఆ తరువాత ఎన్‌టిఆర్, కైకాల ఎన్నో నాయక, ప్రతినాయక పాత్రల్లో ప్రేక్షకులను అలరించారు. ప్రాణ స్నేహితులుగా నటించి అభిమానులను అలరించారు. మొట్టమొదట యమగోల చిత్రంలో యముడు వేషం వేశారు. ఆ తరువాత రావణుడు, దుర్యోధనుడు, యముడు, ఘటోత్కచుడు పాత్రల్లో జీవించారు..



యమగోల చిత్రం తరువాత ఎస్‌వి కృష్ణారెడ్డి యమలీల చిత్రంలో మరోసారి యముడిగా అలరించారు కైకాల .. సాంఘిక చిత్రాల్లో రౌడీ, తండ్రి, తాత పాత్రల్లో నటించి మెప్పించారు. గంభీరమైన పాత్రల్లోనే హాస్యరసం పండించేవారు. రమా ఫిల్మ్ ప్రొడక్షన్ సంస్థను స్థాపించి 'కొదమ సింహం', 'బంగారు కుటుంబం', 'ముద్దుల మొగుడు' లాంటి చిత్రాలను నిర్మించారు..

మరికొన్ని విశేషాలు..

1994లో బంగారు కుటుంబం చిత్రానికి నంది పురస్కారం అందుకున్నారు. 2011లో రఘుపతి వెంకయ్య పురస్కారంతో ఆయనను సత్కరించారు.. ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయ చిత్రాలలో ఆయనకు డూప్‌గా నటించారు.. బాలీవుడ్ చిత్రంలో నటించిన అనుభవం కూడా ఉంది. హిందీ దర్శకుడు సుభాష్ ఘై చిత్రం 'కర్మ'లో కైకాల విలక్షణ పాత్రలో కనిపించారు.

కొన్ని మధురస్మృతులు..

1977లో జనవరి 14న 'దానవీరశూరకర్ణ', 'కురుక్షేత్రం' చిత్రాలు ఒకే రోజు విడుదలయ్యాయి. అందులో రెండు విభిన్న పాత్రలు పోషించారు కైకాల. దానవీరశూరకర్ణలో భీమునిగా, కురుక్షేత్రంలో దుర్యోధనుడిగా నటించి ప్రేక్షకులను మెప్పించిన గొప్ప అవకాశం, ఆ ఘనత కైకాలకే దక్కింది. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించిన ఓ నాటకంలో నటించేందుకు ఆయన స్టేజీ ఎక్కారు. అప్పుడు ప్రేక్షకులందరూ ఎన్‌టిఆర్ ఎన్‌టిఆర్ అంటూ కేకలు వేసినట్లు ఆనాటి సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు ఓ సందర్భంలో. ఇండస్ట్రీలో జేజేలు అందుకున్న సందర్భాలు.. అవకాశాలు లేక బాధలు పడ్డ సందర్భాలు రెండూ ఆయన అనుభవంలో కోకొల్లలు ఉన్నాయి.

నిండైన రూపం .. గంభీర వాచకం

కైకాల సత్యనారాయణ 60 ఏళ్ల సినీజీవితంలో హీరోగా, విలన్‌గా, అన్నగా, నాన్నగా, మామయ్యగా, కమెడియన్‌గా, తండ్రిగా, తాతగా అన్ని పాత్రల్లోనూ నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. నిండైన రూపం, గంభీరమైన వాచకంతో అలరించారు. ఎన్టీఆర్‌కు మిత్రుడిగా 'స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం' అన్న పాటలో ఆయన అద్భుతంగా మెప్పించారు. ఇప్పటికీ స్నేహం అంటే గుర్తువచ్చే పాట ఇదే. ఎన్టీఆర్ 'యమగోల' సినిమాలో ఆయన పోషించిన యమధర్మరాజు పాత్ర మరింత ప్రతిష్ఠను తెచ్చిపెట్టింది. యముడు అంటే కైకాల సత్యనారాయణ అనేలా చేసింది. 'యమలీల' సినిమాలోనూ కామెడీ యముడిగా అదరగొట్టారు.'యముండ..', 'హిమ క్రీములు కావలెను' అన్న డైలాగులు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో నటించిన 'ఘటోత్కచుడు'లో ఆయన నటనతో పిల్లలకు దగ్గరయ్యారు. ఉత్తమ నటుడిగా, విలన్‌గా అనేక పురస్కారాలు అందుకున్న ఆయన తెలుగు విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ కూడా పొందారు. సత్యనారాయణ సోదరుడు నాగేశ్వరరావుకు నిర్మాణరంగంలోకి ప్రవేశించాలనే కోరిక ఉండేది. అందుకే ఎన్టీఆర్ ద్విపాత్రాభినయంతో 'గజదొంగ' చిత్రాన్ని తొలిసారిగా తన సమర్పణలో నిర్మించారు. ఈ చిత్రానికి నాగేశ్వరరావు, చలసాని గోపి నిర్మాతలు. ఆ తర్వాత రమా ఫిల్మ్ సంస్థను నెలకొల్పి కృష్ణ, శోభన్‌బాబులతో 'ఇద్దరు దొంగలు', తన కుమారులు లక్ష్మీనారాయణ, రామారావు నిర్మాతలుగా చిరంజీవితో 'చిరంజీవి', 'కొదమసింహం', చిత్రాలు నిర్మించారు. శోభన్‌బాబుతో 'అడవిరాజా', అక్కినేనితో 'బంగారు కుటుంబం', బాలకృష్ణతో 'ముద్దుల మొగుడు' చిత్రాలు నిర్మించారు.

ఒకే ఏడాది 35 చిత్రాలు...

1970–90 వరకూ తెలుగు సినిమాల్లో ప్రధాన విలన్‌గా ఆయన ఓ వెలుగు వెలిగారు. 1984లో సత్యనారాయణ నటించిన 35 చిత్రాలు విడుదలయ్యాయంటే ఆ రోజుల్లో ఆయనెంత బిజీనో అర్థం చేసుకోవచ్చు. రోజుకి ఐదారు షూటింగుల్లో పాల్గొనేవారు. ఆయన కోసం హీరోలు సెట్‌లో ఎదురు చూసిన సందర్భాలూ ఉన్నాయి. ఆరు పదుల నటజీవితంలో, ఐదు తరాల హీరోలతో, వందలాది విభిన్న పాత్రలు పోషించి, చరిత్ర సృష్టించారు. 1994లో బంగారు కుటుంబం చిత్రంలో అద్భుత నటనకుగాను కైకాలకు నంది పురస్కారం లభించింది.

ఆయన మృతితో చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



'నన్ను తమ్ముడూ అని తోడబుట్టినవాడిలా ఆదరించారు. కల్మషం లేని చిన్నపిల్లల మనస్తత్వం ఆయనది. ఆయతో నాకు ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఆయన్ను మరణం ఇండస్ట్రీకే కాదు, మా కుటుంబానికే తీరని లోటు. చాలా సినిమాల్లో ఆయనతో కలిసి నటించాను.' అంటూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు చిరంజీవి.

ఇంకా ఇతర ప్రముఖుల స్పందనలు ఇలా ఉన్నాయి :


'కైకాల సత్యనారాయణ గారి మరణం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆరు దశాబ్దాలు పాటు తెలుగు సినిమా రంగంలో నవరస నటనా సార్వభౌముడిగా తన వైవిధ్యమైన నటనతో అలరించారు. మా కుటుంబంతో ఆయనకు స్నేహ సంబంధాలున్నాయి. నాన్నగారితో కలిసి చాలా సినిమాల్లో నటించారు. పార్లమెంట్ సభ్యునిగా తనదైన ముద్రవేశారు. ఆయన అందించిన సేవలు మరువలేనివి.' **– బాలకృష్ణ**

కైకాల సత్యనారాయణతో కలిసి మురారి సినిమాలో పని చేసిన సమయంలో ఎన్నో మధురమైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఆయన్ను మిస్ అవుతున్నా. వారి కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి.' **– మహేష్‌బాబు**

కైకాల సత్యనారాయణ ఇంట్లో మనిషిలా అందరితో కలిసిపోయేవారు. సినిమాల్లో ఆయన నటన అద్భుతం. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. **– నాని**

నేను మొట్టమొదట హైదరాబాద్‌కు వచ్చినపుడు సత్యనారాయణ గారి దగ్గరికెళ్లి కథ చెప్పాను. ఆయన సినిమాలకు సహరచయితగా పనిచేశాను. ఆయనతో ఒక తరం ముగిసిపోయినట్టుగా నాకనిపిస్తోంది. మరిచిపోలేని గొప్ప నటుడు కైకాల. **– త్రివిక్రమ్ శ్రీనివాస్**

'చిత్ర పరిశ్రమ మరో లెజెండ్‌ను కోల్పోయింది. నవరస నటనా సార్వభౌమ అనే బిరుదు ఆయనకు సరిగ్గా నప్పేది. ఎన్నో అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించిన ఆయన్ని వెండితెరపై మిస్ అవుతాం. **– శ్రీనువైట్ల**



దటీజ్ మహీ



మహిత పదవ తరగతి చదువుతోంది. తనకు చిన్నప్పటి నుంచి తన మెడ వంకరగా ఉంది కానీ, దాన్ని పట్టించుకోలేదు. తను చదువులో ఎప్పుడూ ముందుండేది. కానీ పెద్దయ్యేకొద్దీ స్నేహితురాళ్లు తనను చూసి వెక్కిరిస్తుంటే చాలా బాధ పడిపోయేది. దాంతో ఒంట్లో బాగోలేదని సరిగా పాఠశాలకు కూడా వెళ్లడం లేదు. వాళ్ళ అమ్మ ఎంత అడిగినా కారణం చెప్పేది కాదు.

ఒకరోజు మహిత మామయ్య ఇంటికి వచ్చారు. ఆయన 'అక్కా! మహిత పాఠశాలకు వెళ్లిందా?' అని అడగ్గానే 'లేదు తమ్ముడూ! అది ఈ మధ్యన బడికి వెళ్లాలంటేనే ఏదో ఇబ్బంది పడుతుంది.' అని చెప్పింది. మామయ్య మహిత దగ్గరికి వెళ్లి విషయం కనుక్కున్నారు. పాఠశాలలో తన స్నేహితులు అన్న మాటలు చెప్పి బాగా ఏడ్చింది మహిత.

'మహితా.. మనిషికి రూపం ముఖ్యం కాదు. మన కృషి, మనసూ గొప్పవైనప్పుడు ఎవరు ఏమన్నా పట్టించుకూడదు. టెన్నిస్ రాజ్యాన్ని ఏలిన సెరేనా విలియమ్స్‌ను నల్ల జాతీయురాలని వెక్కిరించిన వాళ్లే ఇప్పుడు టెన్నిస్ రాణిగా కొలుస్తున్నారు. సచిన్ టెండూల్కర్‌ను పొట్టోడు అని హేళన చేసిన వాళ్లే క్రికెట్‌లో ఆయన విజయం చూసి ఆశ్చర్యపోయారు. నీ రూపాన్ని గురించి ఆలోచించక నీ సామర్థ్యంపై దృష్టి పెట్టు. నిన్ను ఇప్పుడు వెక్కిరించిన వాళ్లే నిన్ను ఆకాశానికి ఎత్తుతారు' అని ధైర్య వచనాలు చెప్పాడు.

అప్పటినుంచీ మహిత ప్రతిరోజూ స్కూలుకు వెళ్లింది. ఎవరు ఏమన్నా పట్టించుకోకుండా చదువు మీదే దృష్టి పెట్టింది. పదవ తరగతిలో మంచి మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించింది. స్నేహితులు అందరూ తన దగ్గరికి వచ్చి అభినందనలు చెబుతూ ' దటీజ్ మహీ' అంటుంటే ఉప్పొంగిపోయింది!

- సారంగి మహిత
9వ తరగతి, మెల్లిచెరువు, సూర్యాపేట.

నేను గీసిన బొమ్మ






-సిహెచ్ సౌమ్య శ్రీ,
4వ తరగతి,
లిటిల్ బడ్స్ స్కూలు,
ఏలూరు,
పశ్చిమ గోదావరి జిల్లా.

మా చిరునామా
రంగవల్లి
ప్రజాశక్తి దినపత్రిక
ప్రజాశక్తి భవనం
అరవింద హై స్కూలు దగ్గర,
అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి - 522501,
గుంటూరు జిల్లా.
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496


రంగవల్లి





వి అరుణ,
మంగళగిరి.
15 చుక్కలు
1 వచ్చేవరకు
(సరి చుక్క)

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



అత్యధిక ధర పలికిన శామ్ కర్రన్

- ఐపిఎల్ చరిత్రలోనే ప్రథమం
- గ్రీన్, స్టోక్స్, పూరన్‌కు 16కోట్లుపైనే..
- సన్‌రైజర్స్ చెంతకు మయాంక్, బ్రూక్
- ఐపిఎల్ మినీ వేలం

కొచ్చి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) మినీ వేలంలో రికార్డు ధరకు విదేశీ క్రికెటర్లు అమ్ముడుపోయారు. ఇంగ్లండ్ యువ క్రికెటర్ శామ్ కర్రన్ ఏకంగా రూ.18.50కోట్ల ధర పలికి ఐపిఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. శామ్ కర్రన్‌ను పంజాబ్ కింగ్స్ దక్కించుకోగా.. ఆస్ట్రేలియా యువ సంచలనం కేమరూన్ గ్రీన్ కూడా రూ.17.50కోట్ల ధరకు ముంబయి ఇండియన్ చెంతకు చేరాడు. ఐపిఎల్ చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో అత్యధిక ధరకు అమ్ముడైన ఆటగాళ్లు వీరే. ఐపిఎల్‌లో ఇప్పటివరకు అత్యధిక ధర పలికింది రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు విరాట్ కోహ్లి(రూ.17కోట్లు) మాత్రమే. ఇప్పుడా రికార్డును వీరు తిరగరాసారు. శుక్రవారం జరిగిన మినీ వేలంలో అత్యధిక ధర పలికిన మరో ఆటగాడు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్. అతడ్ని చెన్నై సూపర్ కింగ్స్ రూ.16.25కోట్లకు కొనుగోలు చేయగా.. నికోలస్ పూరన్‌ను రూ.16కోట్లకు లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం చేజిక్కించుకున్నాయి. వీరంతా రూ.2కోట్ల బేస్ ధరతో ఐపిఎల్ మినీ వేలం బరిలో నిలిచారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రూ.13.25కోట్లకు హారీ బ్రూక్‌ను, రూ.8.50కోట్లకు మయాంక్ అగర్వాల్‌ను దక్కించుకుంది.

భారత ఆటగాళ్లపై ఆసక్తి చూపని ఫ్రాంచైజీలు

ఐపిఎల్ మినీ వేలంలో భారత ఆటగాళ్లను కొనుగోలు చేసుకునేందుకు ఫ్రాంచైజీలు పెద్దగా ఆసక్తి చూపలేదు. శుక్రవారం జరిగిన మినీ వేలంలో అత్యధిక ధర పలికి భారత క్రికెటర్ మయాంక్ అగర్వాల్ మాత్రమే. అతడ్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు రూ.8.5కోట్లకు కొనుగోలు చేసింది. ఇక 2018లో రాజస్థాన్ రాయల్స్ రూ.11.5 కోట్లకు కొనుగోలు చేసిన ఫాస్ట్ బౌలర్ జయదేవ్ ఉనాద్కట్ అతి తక్కువ ధరకు అమ్ముడుపోయాడు. అతడ్ని లక్నో సూపర్ జెయింట్స్ రూ.50 లక్షల కనీస ధరకు దక్కించుకుంది. దేశవాళీ క్రికెట్‌లో స్టార్ బౌలర్ అయిన ఉనాద్కట్ 2018 తర్వాత ఇంత తక్కువ ధరకు అమ్ముడుపోవడం అప్పట్లో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 2019లోనూ అతడిని రూ.8.4 కోట్లకు మళ్లీ కొనుగోలు చేసింది. ఆ తర్వాత 2020, 21లో రూ.3 కోట్లకు ఉనాద్కట్‌ను రాజస్థాన్ రాయల్స్ అట్టిపెట్టకుంది. 2022 సీజన్‌లో ముంబయి 1.3 కోట్లకు సొంతం చేసుకుంటే.. ఈసారి రూ.50లక్షల కనీస ధరకు లక్నో సూపర్ జెయింట్స్ కొనుగోలు చేసింది. యువ బౌలర్ శివం మావిని రూ. 6కోట్లకు గుజరాత్ టైటాన్స్ కొనుగోలు చేసింది. రూ.50 లక్షల కనీస ధరతో మావిని వేలం రేసులో నిలిచాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను రూ. 2కోట్ల కనీస ధరకు గుజరాత్ టైటాన్ తీసుకుంది. 2022 వేలంలో విలియమ్సన్‌ను రూ.14 కోట్లు పెట్టి సన్‌రైజర్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక తెలుగు రాష్ట్రానికి చెందిన అండర్–19 క్రికెటర్ షేక్ రషీద్‌ను రూ.20లక్షలకు చెన్నై సూపర్‌కింగ్స్ చేజిక్కించుకుంది.



కొచ్చిలో మినీ వేలం నిర్వహిస్తున్న ఐసిసి ప్రతినిధి హ్యూజ్ ఎడ్మండ్స్



మినీ వేలంలో కోటి రూపాయలు, ఆపై ధరకు అమ్ముడైన ఆటగాళ్లు

శ్యామ్ కరన్	**: 18.50(పంజాబ్ కింగ్స్)**
కేమరూన్ గ్రీన్	**: 17.50కోట్లు(ముంబయి)**
బెన్ స్టోక్స్	**: 16.25(చెన్నై)**
పూరన్	**: 16.00కోట్లు(లక్నో)**
హారీ బ్రూక్స్	**: 13.25కోట్లు(సన్‌రైజర్స్)**
మయాంక్ అగర్వాల్	: 8.25కోట్లు(సన్‌రైజర్స్)
శివమ్ మావి	: 6.00కోట్లు (గుజరాత్ టైటాన్స్)
జేసన హోల్డర్	: 5.75కోట్లు(రాజస్తాన్)
ముఖేశ్ కుమార్	: 5.50కోట్లు (ఢిల్లీ)
హెన్రిచ్ క్లాసెన్	: 5.25కోట్లు(సన్‌రైజర్స్)
రిలే రూసో	: 4.60కోట్లు(ఢిల్లీ)
జోషూ లిట్టిల్	: 4.40కోట్లు(గుజరాత్)
విల్ జాక్స్	: 3.20కోట్లు(బెంగళూరు)
వివాంత్ శర్మ	: 2.60కోట్లు(సన్‌రైజర్స్)
మనీష్ పాండే	: 2.40కోట్లు(ఢిల్లీ క్యాపిటల్స్)
కేన్ విలియమ్సన్	: 2.25కోట్లు(గుజరాత్)
అదిల్ రషీద్	: 2.00కోట్లు(సన్ రైజర్స్)
ఫిల్ సాల్ట్	: 2.00కోట్లు(ఢిల్లీ క్యాపిటల్స్)
రీస్ టాప్లే	: 1.90కోట్లు(బెంగళూరు)
మయాంక్ దగర్	: 1.80కోట్లు(సన్‌రైజర్స్)
జే రిచర్డ్సన్	: 1.50కోట్లు(ముంబయి)
ఆడం జంపా	: 1.50కోట్లు(రాజస్తాన్)
షకీబ్–అల్–హసన్	: 1.50కోట్లు(కోల్‌కతా)
శ్రీకర్ భరత్	: 1.20కోట్లు (గుజరాత్ టైటాన్స్)
జో రూట్	: 1.00కోటి(రాజస్తాన్)
కేల్ జేమీసన్	: 1.00కోటి(చెన్నై)
అకెల్ హొసైన్	: 1.00కోటి(సన్‌రైజర్స్)
డేవిడ్ విల్సే	: 1.00కోటి(కోల్‌కతా)

శివాలెత్తిన పంత్, శ్రేయస్

టీమిండియాకు 87పరుగుల ఆధిక్యత



ఢాకా: రెండో టెస్టులో టీమిండియాకు ఆధిక్యత లభించింది. ఓవర్ నైట్ స్కోర్ వికెట్ నష్టపోకుండా 19పరుగులతో శుక్రవారం రెండోరోజు ఆటను కొనసాగించిన భారత్ 314 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు రిషభ్ పంత్(93), శ్రేయస్ అయ్యర్(85) సెంచరీలకు దగ్గర్లో ఔటయ్యారు. వీళ్లిద్దరు ఆరో వికెట్‌కు 159 పరుగుల భాగస్వామ్యం జోడించారు. సెంచరీకి చేరువలో ఉన్న పంత్ చివరి సెషన్‌లో మెహిదీ హసన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత బంగ్లా బౌలర్లు విజృంభించడంతో భారత్ వరుసగా వికెట్లు కోల్పో యింది. షకిబుల్ హసన్.. శ్రేయస్ అయ్యర్‌తో పాటు అక్షర్ పటేల్, అశ్విన్‌ను పెవిలియన్ పంపి భారత్‌ను దెబ్బ తీశాడు. ఉనాద్కత్(14నాటౌట్), ఉమేశ్ యాదవ్ (14) కాసేపు బంగ్లా బౌలర్లను ప్రతిఘటించారు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లాం, షకిబుల్ హసన్ తలా నాలుగేసి వికెట్లు దక్కాయి. తస్కిన్ అహ్మద్, మెహిదీ హసన్ మిరాజ్ చెరో వికెట్ పడగొట్టారు. దీంతో టీమిండియాకు 87 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లాదేశ్‌జట్టు రెండోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్ నష్టపోకుండా 7 పరుగులు చేసింది.

ఆంధ్ర సంచలనం

తమిళనాడుపై 8పరుగుల తేడాతో గెలుపు



చెన్నై: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్–బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు 8పరుగుల తేడాతో తమిళనాడుపై సంచలన విజయం సాధించింది. 203పరుగుల లక్ష్యంతో నాల్గోరోజు బ్యాటింగ్‌కు దిగిన తమిళనాడు జట్టు 194పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రజట్టు బౌలర్ షోయబ్ ఖాన్(6/69), శశికాంత్(4/47) కీలకపాత్ర పోషించారు. ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 162పరుగులతో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్రజట్టు 250పరుగులకు ఆలౌటైంది. రికీ బుయ్(76), షోయబ్ ఖాన్(28)కి తోడు శశికాంత్(19), లలిత్(16) లోయర్ ఆర్డర్ బ్యాటింగ్‌లో రాణించారు. సాయికిషోర్‌కు ఐదు, సుందర్‌కు రెండు వికెట్లు దక్కాయి. దీంతో తమిళనాడు 60ఓవర్లలో 203పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సి వచ్చింది. ఈ క్రమంలో తమిళనాడు జట్టు 155పరుగులకు 3వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించేలా కనిపించింది. ఓపెనర్ సుదర్శన్(37), కెప్టెన్ ఇంద్రజిత్(43)కి తోడు సుందర్(65) బ్యాటింగ్‌లో రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్‌ను శశికాంత్, షోయబ్ కూల్చడంతో తమిళనాడు జట్టు 194పరుగులకే ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షోయబ్‌కు లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68